# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి సంపుటి: 10 సంచిక :238 ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ తేది: ఆదివారం 30-11-2025 పేజీలు:4 వెల: 2.00


## మెట్రో ప్రయాణికులకు శుభవార్త

హైదరాబాద్,హైదరాబాద్ మెట్రో ప్రయాణికులకు గుడ్ న్యూస్ చెప్పింది. ప్రయాణంలో భాగంగా మోసుకెళ్లాల్సిన అవసరం లేదు అనుకునే సమాన్లను మెట్రో స్టేషన్లలోనే స్టోర్ చేసుకునే వెసులుబాటు కల్పిస్తోంది . అన్ని మెట్రో స్టేషన్లలో స్మార్ట్ లాకర్ సౌకర్యాన్ని అందుబాటులోకి తెచ్చేందుకు ఏర్పాట్లు చేసింది. అందులో భాగంగా ముందుగా ఏడు స్టేషన్లలో స్మార్ట్ లాకర్లను శుక్రవారం ప్రారంభించింది. హైదరాబాద్ నగరంలోని ఏడు మెట్రో స్టేషన్లలో ఆన్-డిమాండ్ స్మార్ట్ స్టోరేజ్ లాకర్ల సౌకర్యంను ప్రారంభించింది. హైదరాబాద్ మెట్రో స్టేషన్లలో ప్రయాణికులకు సౌకర్యం పెంచటంతో పాటుగా యుటిలిటీ ఆధారిత సేవలను విస్తరించడంలో ఇది ఒక ముఖ్యమైన ముందడుగుగా అభివర్ణిస్తున్నారు. హెల్మెట్లు, సామాను, షాపింగ్ బ్యాగులు, బ్యాక్‌ప్యాక్‌లు సహా ఇతర వ్యక్తిగత వస్తువులను సురక్షితంగా భద్రపరచడం దీని ఉద్దేశం. దీంతో ప్రయాణికులు ఎలాంటి ప్రయాస లేకుండా ప్రశాంతంగా ప్రయాణించే అవకాశం కలుగుతుంది. స్మార్ట్ లాకర్స్ ప్రారంభ కార్యక్రమం ఉప్పల్ మెట్రో స్టేషన్‌లో జరిగింది.

## మంత్రులకు షాక్.. తెలంగాణ కేబినెట్‌లో కీలక మార్పులు



హైదరాబాద్,తెలంగాణ మంత్రి వర్గాన్ని పునర్వ్యవస్థీకరించేందుకు కసరత్తు సాగుతున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు మరో వారం పది రోజుల్లో కీలక మార్పులు, చేర్పులు జరగబోతున్నట్లు సమాచారం. పునర్వ్యవస్థీకరణలో నలుగురు లేదా ఐదుగురు మంత్రుల్ని తప్పించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. మంత్రి కోమటి రెడ్డి వెంకట రెడ్డిని ఏఐసీసీలోకి తీసుకుని ఆయన స్థానంలో కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి అవకాశం ఇవ్వనున్నట్లు సమాచారం.మరోవైపు మంత్రి పొన్నం ప్రభాకర్ పదవిపై కూడా మార్పు తప్పదన్న ప్రచారం రాజకీయ వర్గాల్లో బాగా వినిపిస్తోంది. ఆయన స్థానంలో ప్రస్తుతం టీపీసీసీలో కీలక పాత్ర పోషిస్తున్న మహేశ్ కుమార్ గౌడ్‌కు అవకాశం కల్పించనున్నారని టాక్.ఇక పీసీసీ చీఫ్ పదవిపై కూడా పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. ప్రస్తుత రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా కొత్త నాయకత్వం అవసరమని పార్టీ పెద్దలు భావిస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో శ్రీదర్ బాబుకు పీసీసీ చీఫ్‌గా బాధ్యతలు అప్పగించే అవకాశం ఉందన్న ప్రచారం ఊపందుకుంది.పునర్వ్యవస్థీకరణలో కేవలం వ్యక్తుల మార్పులకే పరిమితం కాకుండా, శాఖల పునర్విభజన కూడా జరగవచ్చని తెలుస్తోంది. కొన్ని కీలక శాఖలను కొత్త మంత్రులకు అప్పగించడం ద్వారా ప్రభుత్వ పనితీరును మరింత దూకుడుగా మార్చాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి అడుగులు వేస్తున్నారనే చర్చ జరుగుతోంది.ఈ మార్పుల వెనుక రాజకీయ సమీకరణలే ప్రధాన కారణంగా కనిపిస్తున్నాయి. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలు, భవిష్యత్ అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా కాంగ్రెస్ మరింత పటిష్టంగా మారేందుకు ఈ పునర్వ్యవస్థీకరణ కీలకంగా మారనుందని పార్టీలోనే చర్చ సాగుతోంది.అయితే, అధికారికంగా మాత్రం ఇంకా ఎలాంటి ప్రకటన వెలువడలేదు. హైకమాండ్ నుంచి తుది ఆమోదం వచ్చిన తర్వాతే మార్పులపై స్పష్టత రానుందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అయినప్పటికీ, ప్రస్తుతం జరుగుతున్న చర్చలు, పేర్లు, సమీకరణలు చూస్తే తెలంగాణ రాజకీయాల్లో మరో కొత్త అధ్యాయానికి తెర లేవనుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

## కేసీఆర్ పేరు లేకుండా.. కవిత ఇంట్రెస్టింగ్ ట్వీట్

హైదరాబాద్,కేసీఆర్ ఆమరణ దీక్షకు 16 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో ఎమ్మెల్సీ కవిత ఆసక్తికర ట్వీట్ చేశారు. తన తండ్రి కేసీఆర్ పేరును ప్రస్తావించకుండా ఒక యోధుని దీక్ష అమరుల త్యాగం యావత్ తెలంగాణ జాతిని మేల్కొల్పింది. ఐక్యతా గీతమైంది. స్ఫూర్తిని నింపింది. ఉద్యమాన్ని విజయపథం వైపు నడిపింది. రాష్ట్ర సాధనకు దారి దీపమైంది. భౌగోళిక తెలంగాణ సాధించాం. సామాజిక తెలంగాణ సాధిస్తోంది. జై తెలంగాణ అని పేర్కొన్నారు.2009 నవంబర్ 29న కేసీఆర్ ఆమరణ దీక్ష ప్రారంభించడం ద్వారా తెలంగాణ ఉద్యమం దేశవ్యాప్తంగా మరో మలుపు తిరిగింది. ఈ దీక్షతో తెలంగాణ ప్రజల ఆకాంక్షలు ఒక్కసారిగా జాతీయ రాజకీయాల్లో కేంద్ర బిందువుగా మారాయి.ఈ ప్రత్యేక రోజున కవిత చేసిన ట్వీట్ భావోద్వేగంగా ఉండటమే కాకుండా, రాజకీయ సంకేతాలు కూడా ఇస్తున్నట్లు కొందరు విశ్లేషిస్తున్నారు. తండ్రి పేరును నేరుగా ప్రస్తావించకుండా "యోధుడు" అని పేర్కొనడం వెనుక వ్యూహాత్మక ఆలోచన ఉందా అన్న చర్చ మొదలైంది.మరోవైపు దీక్షా దివస్ సందర్భంగా తెలంగాణ ఉద్యమాన్ని గుర్తు చేసుకున్నారు హరీష్ రావు. తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో" అనే నినాదంతో 2009 నవంబర్ 29న ప్రారంభమైన ఆమరణ దీక్ష ఉద్యమ గతిని పూర్తిగా మలుపు తిప్పిందని పేర్కొన్నారు. అప్పటి వరకు ప్రత్యేక తెలంగాణ సాధ్యమా అన్న సందేహాలు ఉన్న వేళ, ఆ దీక్ష దేశ రాజకీయాలను కుదిపివేసిందని తెలిపారు. అదే దీక్షతో ఒక సరికొత్త చరిత్రకు నాంది పలికిందని, ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు బాటలు వేసిందని స్పష్టం చేశారు.'రానే రాదు, కానే కాదు' అంటూ



కొందరు ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటును అసాధ్యంగా చిత్రీకరించిన సమయంలో, సబ్బండ వర్గాలను ఏకం చేసి ప్రత్యేక తెలంగాణను సుసాధ్యం చేసి చూపిన ఘన చరిత్ర కేసీఆర్ ది అని హరీష్ రావు కొనియాడారు. నాలుగు కోట్ల ప్రజల ఆకాంక్షను సాకారం చేయడానికి అలుపెరగని పోరాటం చేసిన వ్యక్తి కేసీఆర్ అని గుర్తు చేశారు.పదవుల కోసం కాకుండా, తెలంగాణ కోసం ప్రాణాలు సైతం త్యాగం చేసేందుకు సిద్ధపడ్డ ధీరత్వం ఆయనదేనని వ్యాఖ్యానించారు. తెలంగాణ అజరామర చరిత్రకు వీరోచిత సంతకంగా కేసీఆర్ నిలిచారని, నాలుగు కోట్ల ప్రజలలో ప్రతిధ్వనించే "జై తెలంగాణ" అనే రణ నినాదానికి ఆయనే ప్రతిరూపమని హరీష్ రావు తన పోస్ట్‌లో పేర్కొన్నారు.

## రేవంత్ సర్కార్ సంచలన నిర్ణయం.. హైదరాబాద్ పటాన్ని ఇలా మార్చబోతున్నారా?

హైదరాబాద్,20 ఏళ్లలో నగరం విస్తరించిన తీరు చూస్తే ఇది కేవలం భౌగోళిక వృద్ధి కాదు పరిపాలన, జనసాంద్రత, మౌలిక సదుపాయాలు, వనరుల నిర్వహణ అన్నింటి మీద ప్రభావం చూపిన పరిణామం. ఇలాంటి సమయంలో మరోసారి 'బృహత్ హైదరాబాద్' ప్రణాళిక ప్రభుత్వ మెజ్‌పైకి రావడం సహజమే. ఈసారి మాత్రం మార్పులు మరింత పెద్దవి, మరింత వ్యవస్థాత్మకమైనవి, మరింత దీర్ఘకాల ప్రభావంతో కూడినవిగా కనిపిస్తున్నాయి.ప్రభుత్వం ఇప్పటికే గ్రేటర్‌లోకి 27 పట్టణ స్థానిక సంస్థలను కలపాలని మంత్రివర్గ ఆమోదం పొందింది. ఈ నేపథ్యంలో డిసెంబర్ 1న అధికారికంగా ఆర్డినెన్స్ విడుదల కానుంది. అంటే హైదరాబాద్ నగర విస్తీర్ణం, పరిపాలనా వ్యవస్థ, నిర్మాణం అన్నీ తిరిగి రూపుదిద్దుకోబోతున్నాయి. ఈ ప్రక్రియ మనకు 2007ను గుర్తు చేస్తుంది. ఎంసీహెచ్ నుంచి జీహెచ్ఎంసీగా నగరం భారీగా విస్తరించింది అదే సంవత్సరం. ఆ విస్తరణ ఎలా నగర చరిత్రలో కీలకమైన మలుపు అయితే, ఇదీ అంతేనన్న సంకేతాలు ఇప్పుడు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

మరోసారి భారీ విస్తరణ

ప్రస్తుతం విలీన జాబితాలో 20 మున్సిపాలిటీలు, 7 నగరపాలక సంస్థలు ఉన్నాయి. వీటి విలీనంపై జీహెచ్ఎంసీ అధికారులు సీజీజీతో కలిసి ఇప్పటికే ప్రక్రియను సిద్ధం చేశారు. విలీనంతోపాటు పరిపాలనా మార్పులు వెంటనే అమల్లోకి వస్తాయి. విలీన ప్రాంతాలన్నీ గ్రేటర్ కమిషనర్ ఆధీనంలోకి మారుతాయి. 1955 జీహెచ్ఎంసీ చట్టం ప్రకారం పరిపాలన కొనసాగుతుంది. 2007లో జరిగిన విలీనం విశాల నగరానికి ఒక కొత్త రూపు తీసుకువచ్చింది. ఎంసీహెచ్ పరిధి 172 చదరపు కిమీ నుంచి 650 చదరపు కిమీకి మారింది. అప్పటి 12 మున్సిపాలిటీలను కలపడం వల్ల జోన్ల సంఖ్య 5 నుంచి 6కు, సర్కిళ్లు 7 నుంచి 18కు తర్వాత 30కి పెరిగాయి. నగర పాలన కొత్త దిశలో నడిచింది. ఇప్పుడు జరుగబోయే కొత్త విలీనంతో నగర పరిమాణం, పరిపాలన మరింత విస్తరించనుంది.

గ్రేటర్‌లోకి 57 సర్కిళ్లు..

ప్రస్తుతం జీహెచ్ఎంసీలో 30 సర్కిళ్లు ఉన్నాయి. కొత్తగా చేరే 27 సర్కిళ్లతో వాటి సంఖ్య 57కు చేరుతుంది. ఇవన్నీ ప్రస్తుతం ఉన్న ఆరు జోన్లకే అనుసంధానమవుతాయి. రెండు నెలల తర్వాత జోన్ల సంఖ్య పెరగడం కూడా సాధ్యమే. పెద్ద నగరాల్లో పరిపాలన వ్యవస్థ ఎంత వైవిధ్యంగా ఉండాలన్నదానిపై ప్రభుత్వం ఇంకా నిర్ణయం తీసుకోలేదు కాని ఈసారి నిర్ణయాలు వేగంగా తీసుకోబోతున్నాయన్న భావన స్పష్టంగా ఉంది. సీజీజీ నివేదిక ఈ విషయాల్లో కీలక పాత్ర కానుంది. నగర పరిమాణం పెరగడం వల్ల అవసరమయ్యే అధికారులు, వారి హోదాలు, బాధ్యతలు, విభాగాల నిర్మాణంతో పాటు అన్ని విషయాల్లో మార్గదర్శకాలు త్వరలో ప్రభుత్వం పొందబోతోంది.

ఒకే నగరమా? లేక విభజననా?




ఈ విలీనం తర్వాత వచ్చిన పెద్ద చర్చ ఇదే భవిష్యత్ బృహత్ హైదరాబాద్ ఒకే నగరంగా కొనసాగాలా? లేక రెండు, మూడు నగరపాలక సంస్థలుగా విభజించాలా? అనేది.

విభజనకు అనుకూలంగా చెప్పబడుతున్న కారణాలు:

-విస్తరించిన భౌగోళిక పరిమాణంలో సమర్థవంతమైన పరిపాలన
-ప్రాంతీయ అవసరాల ఆధారంగా మెరుగైన సేవలు
-జనసాంద్రత, వనరుల సమాన పంపిణీ
-ఒకే నగరంగా ఉంచాలని భావిస్తున్నవారి వాదన
-ఒకే పరిపాలనతో సమగ్ర అభివృద్ధి
-సమన్వయంతో ఉన్న మౌలిక వసతుల ప్రణాళిక
-మెగా సిటీలకు అవసరమయ్యే సమగ్రత

సీఎం రేవంత్ రెడ్డి ఈ రెండు ప్రతిపాదనలను పరిశీలిస్తున్నట్లు సమాచారం. కాబట్టి ఈ నిర్ణయం కేవలం పరిపాలనా మార్పు కాదు.. రాజకీయ, నగరాభివృద్ధి, దీర్ఘకాల ప్రణాళికతో పాటు అన్నింటినీ ప్రభావితం చేసేది.

ఇప్పుడు గ్రేటర్ విస్తరణ అవసరం?

దేశంలో పట్టణాలను పరిశీలిస్తే హైదరాబాద్ వేగంగా పెరిగిన నగరాల్లో ఒకటి. ఐటీ, ఔషధ, కమర్షియల్ రంగాల్లో వ్యాపారాలు విస్తరించడంతో నగర పరిసరాలు కూడా వేగంగా మారుతున్నాయి. శివారు ప్రాంతాలు నగర జీవనశైలిలో భాగమవుతున్నాయి. మౌలిక సదుపాయాల విస్తరణ అవసరం పెరుగుతోంది. పట్టణీకరణ శాతం పెరిగి, పరిసర గ్రామాలన్నీ పక్క నగరాల్లా మారుతున్నాయి. మున్సిపాలిటీలకు అవసరమైన వనరులు, సిబ్బంది తక్కువగా ఉండడం వల్ల సేవలు నాణ్యత కోల్పోతున్నాయి. ఈ నేపథ్యంలో పెద్ద నిర్ణయం అవసరమైంది.

బృహత్ హైదరాబాద్ మరోసారి రూపుదిద్దుకోబోతోంది

డిసెంబర్ 1తో విలీనం ప్రక్రియ అధికారికంగా ప్రారంభమైతే హైదరాబాద్ మళ్లీ ఒక కొత్త పరిపాలనా పటం రూపుదిద్దుకుంటోంది. నగరాభివృద్ధి, మౌలిక వసతులు, సేవల నాణ్యత అన్నింటిపై దీర్ఘకాల ప్రభావం ఉండబోతోంది.

## సీఎం రేవంత్ రెడ్డి సొంతూరు కొండారెడ్డిపల్లిలో.. సర్పంచ్ ఎన్నిక ఏకగ్రీవం!




హైదరాబాద్, తెలంగాణలో గ్రామ పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన తర్వాత పల్లెల్లో సందడి వాతావరణ నెలకొంది. సర్పంచ్ ఆశావహులు ఏకగ్రీవాలపై పార్టీ నేతలు దృష్టి పెట్టారు. ఈ మేరకు గ్రామస్తులను ఒప్పించేందుకు వివిధ హామీలు కురిపిస్తున్నాయి ప్రధాన పార్టీలు. ఈ క్రమంలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంతూరు కొండారెడ్డిపల్లిలో సర్పంచ్ స్థానం ఎస్సీకి రిజర్వ్ అయింది. అయితే ఇక్కడ సర్పంచ్ ఎన్నిక ఏకగ్రీవమైనట్లు తెలిపారు.

సర్పంచ్ ఆశావహులు ఏకగ్రీవాలపై పార్టీ నేతల దృష్టి

నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలం కొండారెడ్డిపల్లి పంచాయతీలో సర్పంచ్ స్థానం ఎస్సీకి రిజర్వేషన్ ప్రకటించిన వెంటనే.. సర్పంచ్ పదవి కోసం 15 మంది పోటీ పడ్డట్లు తెలుస్తోంది. పంచాయతీని ఏకగ్రీవం చేసేందుకు స్థానిక నాయకులు కసరత్తు చేపట్టారు.

అన్నీ వార్డు సభ్యుల పదవులకు ఒక్కో నామినేషన్ దాఖలు..

స్థానిక నాయకులు గ్రామస్థులంతా ఏకాభిప్రాయానికి వచ్చి, సర్పంచిగా మల్లెపాకుల వెంకటయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకునేందుకు తీర్మానించినట్లు సమాచారం. కేవలం సర్పంచి పదవికే కాకుండా, అన్ని వార్డు సభ్యుల పదవులకు ఒక్కో నామినేషన్ దాఖలు చేయించి, మొత్తం పాలకవర్గాన్ని పోటీ లేకుండా ఎన్నుకోవాలని స్థానికులు నిశ్చయించినట్లు తెలుస్తోంది.

బలమైన రాజకీయ సమన్వయం..

ఈ ఏకాభిప్రాయం వెనుక బలమైన రాజకీయ సమన్వయం కనిపిస్తుంది. ఎస్సీ రిజర్వేషన్ స్థానానికి మల్లెపాకుల వెంకటయ్యను ఏకగ్రీవ అభ్యర్థిగా ఎంచుకోవడం అనేది స్థానిక రాజకీయ వర్గాల మధ్య పూర్తి ఏకాభిప్రాయానికి దారితీసింది. ఈ ప్రక్రియలో సీఎం కుటుంబానికి, స్థానిక నాయకులకు మధ్య ఉన్న సమన్వయం స్పష్టమవుతుంది.

## మేడారం జాతరకు జాతీయ హోదా సాధ్యం కాదు..

వరంగల్ : మేడారం జాతరకు జాతీయ హోదా సాధ్యం కాదని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. వరంగల్ పర్యటనలో భాగంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. దేశంలో ఏ ఉత్సవాలకు జాతీయ హోదా లేదని పేర్కొన్నారు. మేడారం జాతర అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని అన్నారు.వరంగల్ అభివృద్ధికి కేంద్రం ప్రత్యేక శ్రద్ధతో ఉందని కిషన్ రెడ్డి తెలిపారు. రామప్ప, వేయిస్తంభాల గుడికి పూర్వ వైభవం వచ్చిందని అన్నారు. భక్తుల అవసరాలకు తగ్గట్టు వసతులు సమకూరుస్తామని చెప్పారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వ సహకారం కోసం లేఖ రాశానని తెలిపారు. కానీ ఇంకా రాష్ట్ర ప్రభుత్వం నుంచి స్పందన రాలేదని అన్నారు.వరంగల్ రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులను శనివారం ఉదయం కిషన్ రెడ్డి పరిశీలించారు. ఇందుకోసం వందే భారత్ రైలులో హైదరాబాద్ నుంచి వరంగల్ బయల్దేరి వెళ్లారు. ఈ సందర్భంగా రైల్వే స్టేషన్ క్యాంటీన్‌లో చాయ్ పే చర్చా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం నగరంలోని భద్రకాళి



అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

## నగరంలో మరిన్ని ఇందిరమ్మ క్యాంటీన్లు...



హైదరాబాద్: నగరానికి ఉపాధికోసం వచ్చే కార్మికులకు ఇందిరమ్మ క్యాంటీన్లు ఎంతగానో దోహదపడ్డాయని, ఈ క్యాంటీన్లను నిరుపేద ప్రజలు అందరూ సద్వినియోగం చేసుకోవాలని నగర ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ కోరారు. కవాడిగూడ కల్పన థియేటర్ వద్ద, బాగ్‌లింగంపల్లిలో నూతనంగా ఏర్పాటు చేసిన ఇందిరమ్మ క్యాంటీన్‌లను శుక్రవారం మంత్రి ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ రాబోయే రోజుల్లో మరిన్ని ఇందిరమ్మ క్యాంటీన్లను విస్తరించేందుకు చర్యలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ అధికారులను ఆదేశించారు.అలాగే పొదుపు మహిళా సభ్యులు మరిన్ని గ్రూపులు పెంచాలని, త్వరలో వడ్డీలేని బ్యాంక్ రుణాలు ఇప్పిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. భవిష్యత్‌లో ఇందిరమ్మ క్యాంటీన్లను మహిళా పొదుపు గ్రూపు సభ్యులకు అప్పగించి, వారి ఆర్థిక స్వావలంభనకు తోడ్పాడుటును అందిస్తామని తెలిపారు. మేయర్ గద్వాల విజయలక్ష్మి మాట్లాడుతూ నగరంలో అవసరమైన చోట ఇందిరమ్మ క్యాంటీన్లు ఏర్పాటు చేసి పేదల ఆకలి తీర్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ మాట్లాడుతూ నగరంలోని పేదల ఆకలి తీర్చడానికి గత ప్రభుత్వం ప్రారంభించిన భోజన కేంద్రాలను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా క్యాంటీన్ల వద్ద కార్మికులు, ప్రజలతో కలిసి మంత్రి పొన్నం, మేయర్, ఎమ్మెల్యే, ఎంపీ అల్పాహారం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతారెడ్డి, కార్పొరేటర్లు జి.రచనశ్రీ, కె.రవిచారి, గౌసుద్దీన్, బీఆర్ఎస్ నాయకులు ముఠాజైసింహ, బీజేపీ నాయకులు జి.వెంకటేష్, మాజీ కార్పొరేటర్లు, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

### దిత్వా తుఫాన్‌తో ఎపిలో వర్షాలు

అమరావతి, శ్రీలంకలో మొదలైన దిత్వా తుఫాను ఏపీని తాకే అవకాశం ఉండడంతో ప్రభుత్వం అధికారులను అప్రమత్తం చేసింది. ప్రజలకు మెచ్చరికలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో తిరుపతి, చిత్తూరు, కడప, నెల్లూరు, ప్రకాశం జిల్లాల అధికారులను హోంమంత్రి వంగలపూడి అనిత అప్రమత్తం చేశారు. మరో రెండు రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో అనుక్షణం అప్రమత్తంగా ఉండాలన్నారు.

## రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా దీక్షా దివస్.. సిద్దిపేటలో హరీశ్‌రావు బైక్ ర్యాలీ



హైదరాబాద్,రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ శ్రేణులు దీక్షా దివస్‌ను ఘనంగా జరుపుకుంటున్నారు. సిద్దిపేటలో అంబేద్కర్ విగ్రహానికి హరీశ్‌రావు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నగరంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, యాదవరెడ్డి పాల్గొన్నారు.

ఖమ్మంలో నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్సీ తాతా మధు, ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, చంద్రావతి పాల్గొన్నారు. తెలంగాణ తల్లి విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. దీక్షా దివస్ సందర్భంగా సంగారెడ్డిలో అమరవీరులకు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, రాష్ట్ర నాయకులు దేవీప్రసాద్ ఇతర బీఆర్ఎస్ నాయకులు నివాళులర్పించారు. హైదరాబాద్‌లోనూ దీక్షా దివస్‌ను ఘనంగా జరుపుకుంటున్నారు. తెలంగాణ భవన్‌కు భారీగా బీఆర్ఎస్ శ్రేణులు తరలివచ్చాయి. ఉస్మానియా యూనివర్సిటీలో బీఆర్ఎస్ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలో మాధవరం కృష్ణారావు ఆధ్వర్యంలో దీక్షా దివస్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాధవరం మాట్లాడుతూ.. కేసీఆర్ దీక్షతోనే తెలంగాణ వచ్చిందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ ప్రాణత్యాగానికి కూడా సిద్ధపడ్డారని పేర్కొన్నారు. తెలంగాణను అభివృద్ధి చేసిన ఘనత కేసీఆర్‌దే అని చెప్పారు.

### నెల్లూరులో సిపిఎం కార్యకర్త దారుణ హత్య

నెల్లూరు, నెల్లూరు పట్టణం వేదాయపాళెం సమీపంలో ఆర్ డి టీ కాలనీలో సిపిఎం కార్యకర్త, యువనాయకుడు, కళాకారుడు కె. పెంచలయ్యను కొంతమంది దుండగులు కత్తులతో దాడి చేసి దారుణంగా హత్య చేశారు. నెల్లూరు జనరల్ హాస్పిటల్ మార్చురీలో పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉంచారు. సిపిఎం నాయకత్వం, కార్యకర్తలు నెల్లూరు జనరల్ హాస్పిటల్ కు పెద్ద ఎత్తున చేరుకొన్నారు. పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు. పెంచలయ్య హత్యను సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు తీవ్రంగా ఖండించారు. అసాంఘిక గంజాయి గూండాల దాడిలో హత్యకు గురైన పెంచలయ్య మృతికి సంతాపం ప్రకటించారు. హత్య చేసిన గూండాలను పట్టుకుని కట్టినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేసారు. ఆ ప్రాంతంలో గంజాయి బారిన పడకుండా యువతను చైతన్య పరుస్తున్నందున ఓర్చుకోలేని గంజాయి వ్యాపారం చేస్తున్న ముఠా ఈ అఘాయిత్యానికి పాల్పడిందని పేర్కొన్నారు. ఇలాంటి ముఠాలను కఠినంగా అణచివేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండు చేశారు.

## సంపాదకీయం


ఆదివారం 30-11-2025

# పత్తి రైతులపై నిబంధనల కత్తి !

ఉభయ తెలుగు రాష్ట్రాల్లో రైతులు చిత్తవుతున్నారు. రైతులు ఆనందంగా తమ పంటలను అమ్ముకున్నా మన్న భరోసాలో లేరు. ధాన్యం ఏదైనా దైన్యంగానే గడుపుతున్నారు. ముఖ్యంగా తెల్లబంగారం పండిస్తున్న రైతులు తెల్లమొహం వేయాల్సి వస్తోంది. పత్తి కొనుగోలులో రైతులకు సిసిఐ నిబంధనలు తీవ్ర ప్రతిబంధకంగా మారాయి. అమెరికా టారిఫ్ యుద్ధం నేపథ్యంలో భారత రైతుల ప్రయోజనాలను ఎట్టిపరిస్థితుల్లో కాపాడి తీరుతానని ప్రకటించిన ప్రధాని నరేంద్ర మోదీ పత్తిపై దిగుమతి సుంకాన్ని 11 శాతం నుంచి సున్నాకు తగ్గించడం రైతుకు విపరీత శరాఘాతమైంది. దీని ఫలితంగా అమెరికా, బ్రెజిల్ నుంచి విదేశీ పత్తి వరదలా వచ్చిపడుతుంటే స్వదేశీ పత్తి ధర లేక విలవిల్లాడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు పత్తి కొనుగోళ్ల సమస్యపై పూర్తి అలసత్వం చూపుతున్నాయి. సీసీఐ రెండుసార్లు టెండర్లు పిలిచినా మిల్లుల యాజమాన్యాలు ఎగ్గొట్టాయి. దాంతో విధిలేక మూడోసారి పిలవాల్సి వచ్చింది. వీటన్నిటి ఫలితంగా సిరులు తెస్తుందనుకున్న తెల్ల బంగారం రైతుల నడ్డి విరుస్తోంది. ఆశలు కోల్పోయిన పత్తి రైతులు పంటలను తగులబెడుతున్నారు. అన్నిరకాలుగా ఆశలు అడుగంటడంతో పత్తి రైతులు రోడ్డెక్కి ధర్నాలు చేయాల్సి వచ్చింది. ప్రైవేటు వ్యాపారుల మీద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చూపే ప్రేమలో లేశమైనా రైతుల మీద చూపితే ఈ పరిస్థితి వచ్చేది కాదు. పత్తి విక్రయానికి అనేక ఆంక్షలు కొనసాగుతున్నాయి. ఇ-క్రాప్‌లో నమోదు నమోదై ఉండాలి. దీంతోపాటు రైతు సేవా కేంద్రంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ వద్ద పేరు నమోదు చేసుకోవాలి. సిఎం యాప్, కపాస్ కిసాన్ యాప్‌లో పేర్లు నమోదు చేశాక సమీప కొనుగోలు కేంద్రంలో ఉన్న జిన్నింగ్ మిల్లులకు పత్తిని తీసుకొని వెళ్లాలి. ఎనిమిది శాతం నుంచి 12 శాతం తేమ ఉంటే మూడు కేజీలు తరుగు పెడుతున్నారని రైతులు వాపోతున్నారు. 12 శాతం మించి తేమ ఉంటే కొనుగోలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యాప్‌లో స్లాట్ బుకింగ్ నిబంధన, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వకపోవడం వల్ల పత్తిని అమ్ముకునేందుకు ఇబ్బందులు తప్పడం లేదు. ఎకరాకు ఏడు క్వింటాళ్లను మాత్రమే కొనాలన్న నిబంధన రైతులకు తీవ్ర ఇబ్బందికరంగా మారింది. ఎకరాకు గరిష్ఠంగా 12 నుంచి 15 క్వింటాళ్లకు దిగుబడి వచ్చే అవకాశం ఉండగా, మొత్తం దిగుబడిలో సగం కొనుగోలు చేస్తే మిగతా పత్తి ఎక్కడ అమ్ముకోవాలని రైతులు ఆందోళన చెందుతున్నారు. తేమ శాతం ఎనిమిది నుంచి 12 శాతం వరకు ఉన్నా కనీస మద్దతు ధర రూ.8,110 ఇవ్వడం లేదని రైతులు చెబుతున్నారు. అంతే కంటే ఎక్కువగా తేమ శాతం ఉంటే కొనుగోలు చేయడం లేదు. ఆరబెట్టి తీసుకురావాలని అధికారులు తెగేసి చెప్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలతోపాటు ప్రస్తుతం మంచు కురుస్తున్నందున 15 నుంచి 18 శాతం వరకు తేమ శాతం ఉన్నా అనుమతించాలని రైతులు కోరుతున్నారు. ఆరబెట్టుకునేందుకు తగిన స్థలం లేదని చెప్తున్నారు. పత్తి కొనుగోలుకు కపాస్ కిసాన్ యాప్‌లో నమోదు చేసుకోవాలనే నిబంధనను రద్దు చేయాలని కోరుతున్నారు. ఇలా రైతన్నలను అడుగడుగునా ఇబ్బందులు పెడుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటనలతో మభ్య పెట్టడం తప్ప క్షేత్రస్థాయి సమస్యలను పట్టించుకోవడం లేదు.. ఏ సాయం అందకపోయినా, సొంతంగా పెట్టుబడి సమకూర్చుకొని, ఆరుగాలం కష్టపడి పంట పండించి అమ్ముదామంటే మార్కెట్‌కు పోతే కొనేవారు కరువు. దీని ఫలితంగా అన్నదాతలు, మరీ ముఖ్యంగా పత్తి రైతులుచిత్తవుతున్నారు. మద్దతు ధర అస్థిరంగా ఉండటం, ప్రకటించిన ధర కూడా ఇవ్వకపోవడం రైతులపాలిట శాపంగా మారుతున్నది. ఇటు రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్య ధోరణి, అటు కేంద్రప్రభుత్వ రైతు వ్యతిరేక వైఖరి కారణంగా పత్తి రైతు పరిస్థితి అగమ్యగోచరంగా మారుతున్నది. పత్తి కొనుగోలు విషయంలో రైతులకు అండగా నిలవాల్సిన కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సీసీఐ అడుగడుగునా కొర్రీలు వేస్తున్నది. గతేడాది మద్దతు ధర క్వింటాలుకు రూ.7,521 కాగా రైతుకు దక్కింది రూ.5,500 మాత్రమే. అంటే రూ.2,000 కోత కింద పోయింది. ఈ ఏడాది మద్దతు ధర రూ.8,100కు పెంచినట్టు చెప్తున్నప్పటికీ రైతు చేతికి వచ్చేది రూ.6,000 మాత్రమే. సీసీఐ స్వయంగా మద్దతు ధర పూర్తిగా చెల్లించనప్పుడు ప్రైవేటు వ్యాపారి మాత్రం ఎలా చెల్లిస్తాడని రైతులు వాపోతున్నారు. గతంలో పత్తి కొనుగోళ్లలో జరిగిన అవకతవకల నివారణకు సీసీఐ ప్రవేశపెట్టిన నిబంధనలపై జిన్నింగ్ మిల్లులు తీవ్రంగా ప్రతిఘటిస్తుండటంతో పత్తి కొనుగోళ్లకు అడ్డంకులు ఏర్పడ్డాయి. టెండర్ల ప్రక్రియకు బ్రేకులు పడి పత్తి రైతు దిక్కుతోచని పరిస్థితిలో పడ్డారు. ప్రభుత్వాల నిర్లక్ష్యంతో విలవిలలాడుతున్న పత్తి రైతుకు యాప్ రూపంలో మరో గండం వచ్చిపడింది. కపాస్ కిసాన్ యాప్ ద్వారానే కొనుగోళ్లు జరుపుతామని సీసీఐ షరతు పెట్టింది. చాలామంది రైతుల వద్ద ఇప్పటికీ స్మార్ట్ ఫోన్లు లేవు. పైగా రాష్ట్రమంతటా, ముఖ్యంగా పత్తిరైతులు ఎక్కువగా ఉండే ఆదిలాబాద్ వంటి ప్రాంతాల్లో సరైన మొబైల్ నెట్‌వర్క్ అందుబాటులో లేదు. దీంతో రిజిస్ట్రేషన్ నుంచి అమ్మకం దాకా సమస్యలు వెన్నాడాయి. యాప్ కనెక్ట్ కాకపోతే ప్రైవే టు వ్యాపారుల్లో గతి అనే పరిస్థితి నెలకొన్నది. ఈలోగా వానలు, వరదలు ముంచెత్తడంతో పత్తిబేళు తడిసి అసలుకే ఎసరు వస్తున్నది. ఇంకోవైపు ఎకరాకు సగటున 13 క్వింటాళ్లు కొంటామన్న సీసీఐ చివరి నిమిషంలో చెప్పాపెట్టకుండా ఎకరాకు 7 క్వింటాళ్లకు తగ్గించడంతో రైతుల నెత్తిన పిడుగుపడింది. తేమ శాతం ఎక్కువగా ఉందనో, రంగు మారిందనో ఇష్టారాజ్యంగా ధర చెల్లిస్తున్నారు. ఇప్పుడు 12 శాతం ఉంటేనే నాసిరకం అంటూ ధర తగ్గిస్తున్నారు. పంట దిగుబడి సమయంలో, మార్కెట్‌కు తరలించే సమయంలో వర్షాలు, తుఫానులు రావడం సహజమే. తద్వారా తేమశాతం కొంచెం పెరగడమూ సహజమే. ఈ నేపథ్యంలో రైతు పట్ల కనీస సానుభూతితో వ్యవహరించ కుండా కొర్రీలతో చుక్కలు చూపించడం ఏ మాత్రం సమర్థనీయం కాదు. ఇతర రాష్ట్రాల్లోనూ యాప్ కారణంగా పత్తి రైతులు యాతనలు పడ్డారు. పంజాబ్ రైతులైతే ఈ యాప్ తమకొద్దని తిరస్కరించారు. ఈ క్రమంలో దేశంలో పత్తి మార్కెట్ తీవ్రమైన కుదుపును ఎదుర్కోవడం కారణంగా పత్తి పండించే రైతులకు శరాఘాతంగా మారింది. దీనిపై కేంద్రం వెంటనే స్పందించి, దేశీయంగా పత్తి రైతులను ప్రోత్సహించాల్సి ఉంది.

# దడ పుట్టిస్తున్న 'సర్'

న్యూఢిల్లీ,స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) పేరిట బిహార్‌లో ప్రకంపనలు సృష్టించిన ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ డజను రాష్ట్రాలూ, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఈ నెల 4న మొదలైంది. వచ్చే నెల 4తో ముగిసే ఈ ప్రక్రియలో బూత్ లెవెల్ అధికారి(బీఎల్ఓ) పాత్ర కీలకమైనది. ఓటర్ల ఇళ్లకు పోయి ఓటర్ నమోదు పత్రాలు అందించటం, వెనక్కి తీసుకోవటం, అవసరమైన పత్రాలు జతచేశారో లేదో చూడటం వారి బాధ్యత. ఫలానా వ్యక్తి అర్హుడైన ఓటరో కాదో ప్రాథమికంగా తేల్చేది వీరే. అదే వారి చావుకొస్తోంది. బిహార్‌కు భిన్నంగా ఈ ప్రక్రియ చాలా రాష్ట్రాల్లో మరణ మృదంగం మోగిస్తోంది. మరణాలు, బలవన్మరణాలు, అస్వస్థులు కావటం, భయాందోళనలతో అప్పగించిన పని వదిలి అదృశ్యం కావటం వంటి ఉదంతాలు చోటుచేసుకుంటున్నాయి. బిహార్‌లో బీఎల్ఓలకు ఈ స్థాయిలో సమస్యలున్న దాఖలా లేదు. నిజానికి అక్కడ బీఎల్ఓలతోనే ఓటర్లకు సమస్యలెదురైన ఉదంతాలున్నాయి. బీఎల్ఓలకు వెరిఫికేషన్‌లో సహకరించేందుకు పార్టీలు తమ కార్యకర్తలను బూత్ లెవెల్ ఏజెంట్లు(బీఎల్ఏ)గా నియమించుకునేందుకు ఎన్నికల కమిషన్(ఈసీ) అవకాశమిచ్చింది. సహజంగానే వారు పరిష్కారంలో కాక సమస్యలో భాగమవుతున్నారు. ఓటర్ల ఎదుటే బీఎల్ఓలతో వాదులాటలకు దిగటం, బెదిరించటం చాలాచోట్ల కనబడే దృశ్యాలు. పశ్చిమ బెంగాల్, కేరళ, తమిళనాడు, రాజస్థాన్, గుజరాత్ తదితర చోట్ల బీఎల్ఓలు 'సర్' ప్రక్రియలో తీవ్ర ఒత్తిళ్లకు లోనవుతున్నారు. ఎన్నికల ప్రచారంలో చేతికి ఎముక లేకుండా భారీ వాగ్దానాలు చేయటం, అధికారం వచ్చాక ఎగనామం పెట్టడం మన దేశంలో దశాబ్దాలుగా సాగిపోతున్న ఒక దుస్సంప్రదాయం. ఈ విషయంలో న్యాయ స్థానాలకెళ్లినా ఫలితం ఉండదు. కడుపు మండి నిలదీస్తే జైలుపాలు చేయటం, కార్య కర్తలను పంపించి దౌర్జన్యం చేయించటం ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పుడు చాలాచోట్ల కనబడుతోంది. ఇంత జరుగుతున్నా, ఈవీఎంలు ఏమార్చి ఓట్లు కొల్లగొడుతున్నారన్న ఆరోపణలు మిన్నంటుతున్నా, ఎన్నికల సంఘం పట్టనట్టు వ్యవహరిస్తోంది. అయినా ఎన్నికల వ్యవస్థపై ఉండే అచంచల విశ్వాసమే ప్రజాస్వామ్యాన్ని ఈమాత్రంగానైనా బతికిస్తోంది. ఓటు పోతే జీవచ్ఛవంతో సమానమన్న అభిప్రాయం జనంలో ప్రబలంగా ఉంది. ప్రజాస్వామ్యంలో అసమ్మతి తెలపాలన్నా, ఆగ్రహావేశాలు వ్యక్తంచేయాలన్నా సామాన్యు లకు ఓటును మించిన ఆయుధం మరేదీ లేకపోవటం ఇందుకు కారణం కావచ్చు. బీఎల్ఓలు ఒత్తిడికి లోనవటం వెనక ఇతరేతర సమస్యలు కూడా ఉన్నాయి. గతంలో ఓటేసే రోజునే తమ ఓటు గల్లంతైందని తెలిసేది. కానీ ఇప్పుడలా కాదు. ఓటరు తన వివరాలతోపాటు అవసరమైన పత్రాలన్నీ అందజేసిన క్షణానే అది చూచాయగా తెలిసి పోతుంది. నెల రోజుల తర్వాత పేరుందో లేదో రూఢి అవుతుంది. లేకపోవటానికి గల కారణమేమిటో అందులో ప్రస్తావిస్తారు. ఆ చిరునామాలో ఓటరు లేడనో, మరణించా డనో, తగిన పత్రాలు అందించలేదనో వెల్లడిస్తారు. దానిపై మళ్లీ పంచాయతీ. నమోదు సమయంలో బీఎల్ఏల నుంచి వచ్చే ఒత్తిళ్లు ఒకపక్క, వాటిని తట్టుకోలేక ఏదైనా చేస్తే ప్రభుత్వం నుంచి చర్యలు మరోపక్క వారిని బాధిస్తున్నాయి. బీఎల్ఓల్లో 90 శాతం టీచర్లే. గుజరాత్ వంటిచోట్ల సాయంత్రం వరకూ విద్యాబోధనలోనూ, అటుతర్వాత రాత్రి 9వరకూ ఫీల్డ్‌లోనూ తలమునకలు కావాలి. మళ్లీ ఇంటికొచ్చి సేకరించిన పత్రాలన్నీ డిజిటల్ ఫామ్‌లోకి మార్చి పంపాలి. ఇవన్నీ ఎప్పటికప్పుడు కాకపోతే పై అధికారుల హెచ్చరికలు. సారాంశంలో ఓటర్ మొదలుకొని అందరికందరూ పెత్తనం చలాయించే వారే. ఈసీకి ఇవి పట్టవు. 'సబ్ ఠీక్ హై' అంటోంది. గౌరవ ప్రదమైన జీవితం వెళ్లదీయదల్చుకున్నవారు ఉద్యోగాలు చేస్తారు. అందుకు జీతంతోపాటు గౌరవ మర్యాదలూ ఆశిస్తారు. కానీ అదనపు భారాలు మోపి, వెట్టి కార్మికుల కన్నా హీనంగా చూస్తూ, బెదిరింపులకు దిగటం వల్ల వారు సమాజంలో ఆత్మ గౌరవంతో బతకగలుగుతారా? పిల్లలను రేపటి పౌరులుగా తీర్చిదిద్దగలుగుతారా? గర్భిణులనూ, 45 ఏళ్లు దాటినవారినీ, అంగవైకల్యం ఉన్నవారినీ ఈ బాధ్యతల నుంచి తప్పించాలని గుజరాత్‌లో ఒక ఉపాధ్యాయ సంఘం కోరినా ఫలితం లేకపోయిందట! ఈ ధోరణి సరికాదు. దీన్ని వెంటనే చక్కదిద్దటం ఈసీ, కేంద్రం బాధ్యత. దడ పుట్టిస్తున్న 'సర్'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) పేరిట బిహార్‌లో ప్రకంపనలు సృష్టించిన ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ డజను రాష్ట్రాలూ, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఈ నెల 4న మొదలైంది. వచ్చే నెల 4తో ముగిసే ఈ ప్రక్రియలో బూత్ లెవెల్ అధికారి(బీఎల్ఓ) పాత్ర కీలకమైనది. ఓటర్ల ఇళ్లకు పోయి ఓటర్ నమోదు పత్రాలు అందించటం, వెనక్కి తీసుకోవటం, అవసరమైన పత్రాలు జతచేశారో లేదో చూడటం వారి



బాధ్యత. ఫలానా వ్యక్తి అర్హుడైన ఓటరో కాదో ప్రాథమికంగా తేల్చేది వీరే. అదే వారి చావుకొస్తోంది. బిహార్‌కు భిన్నంగా ఈ ప్రక్రియ చాలా రాష్ట్రాల్లో మరణ మృదంగం మోగిస్తోంది. మరణాలు, బలవన్మరణాలు, అస్వస్థులు కావటం, భయాందోళనలతో అప్పగించిన పని వదిలి అదృశ్యం కావటం వంటి ఉదంతాలు చోటుచేసుకుంటున్నాయి. బిహార్‌లో బీఎల్ఓలకు ఈ స్థాయిలో సమస్యలున్న దాఖలా లేదు. నిజానికి అక్కడ బీఎల్ఓలతోనే ఓటర్లకు సమస్యలెదురైన ఉదంతాలున్నాయి. బీఎల్ఓలకు వెరిఫికేషన్‌లో సహకరించేందుకు పార్టీలు తమ కార్యకర్తలను బూత్ లెవెల్ ఏజెంట్లు(బీఎల్ఏ)గా నియమించుకునేందుకు ఎన్నికల కమిషన్(ఈసీ) అవకాశమిచ్చింది. సహజంగానే వారు పరిష్కారంలో కాక సమస్యలో భాగమవుతున్నారు. ఓటర్ల ఎదుటే బీఎల్ఓలతో వాదులాటలకు దిగటం, బెదిరించటం చాలాచోట్ల కనబడే దృశ్యాలు. పశ్చిమ బెంగాల్, కేరళ, తమిళనాడు, రాజస్థాన్, గుజరాత్ తదితర చోట్ల బీఎల్ఓలు 'సర్' ప్రక్రియలో తీవ్ర ఒత్తిళ్లకు లోనవుతున్నారు. ఎన్నికల ప్రచారంలో చేతికి ఎముక లేకుండా భారీ వాగ్దానాలు చేయటం, అధికారం వచ్చాక ఎగనామం పెట్టడం మన దేశంలో దశాబ్దాలుగా సాగిపోతున్న ఒక దుస్సంప్రదాయం. ఈ విషయంలో న్యాయ స్థానాలకెళ్లినా ఫలితం ఉండదు. కడుపు మండి నిలదీస్తే జైలుపాలు చేయటం, కార్య కర్తలను పంపించి దౌర్జన్యం చేయించటం ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పుడు చాలాచోట్ల కనబడుతోంది. ఇంత జరుగుతున్నా, ఈవీఎంలు ఏమార్చి ఓట్లు కొల్లగొడుతున్నారన్న ఆరోపణలు మిన్నంటుతున్నా, ఎన్నికల సంఘం పట్టనట్టు వ్యవహరిస్తోంది. అయినా ఎన్నికల వ్యవస్థపై ఉండే అచంచల విశ్వాసమే ప్రజాస్వామ్యాన్ని ఈమాత్రంగానైనా బతికిస్తోంది. ఓటు పోతే జీవచ్ఛవంతో సమానమన్న అభిప్రాయం జనంలో ప్రబలంగా ఉంది. ప్రజాస్వామ్యంలో అసమ్మతి తెలపాలన్నా, ఆగ్రహావేశాలు వ్యక్తంచేయాలన్నా సామాన్యు లకు ఓటును మించిన ఆయుధం మరేదీ లేకపోవటం ఇందుకు కారణం కావచ్చు. బీఎల్ఓలు ఒత్తిడికి లోనవటం వెనక ఇతరేతర సమస్యలు కూడా ఉన్నాయి. గతంలో ఓటేసే రోజునే తమ ఓటు గల్లంతైందని తెలిసేది. కానీ ఇప్పుడలా కాదు. ఓటరు తన వివరాలతోపాటు అవసరమైన పత్రాలన్నీ అందజేసిన క్షణానే అది చూచాయగా తెలిసి పోతుంది. నెల రోజుల తర్వాత పేరుందో లేదో రూఢి అవుతుంది. లేకపోవటానికి గల కారణమేమిటో అందులో ప్రస్తావిస్తారు. ఆ చిరునామాలో ఓటరు లేడనో, మరణించా డనో, తగిన పత్రాలు అందించలేదనో వెల్లడిస్తారు. దానిపై మళ్లీ పంచాయతీ. నమోదు సమయంలో బీఎల్ఏల నుంచి వచ్చే ఒత్తిళ్లు ఒకపక్క, వాటిని తట్టుకోలేక ఏదైనా చేస్తే ప్రభుత్వం నుంచి చర్యలు మరోపక్క వారిని బాధిస్తున్నాయి. బీఎల్ఓల్లో 90 శాతం టీచర్లే. గుజరాత్ వంటిచోట్ల సాయంత్రం వరకూ విద్యాబోధనలోనూ, అటుతర్వాత రాత్రి 9వరకూ ఫీల్డ్‌లోనూ తలమునకలు కావాలి. మళ్లీ ఇంటికొచ్చి సేకరించిన పత్రాలన్నీ డిజిటల్ ఫామ్‌లోకి మార్చి పంపాలి. ఇవన్నీ ఎప్పటికప్పుడు కాకపోతే పై అధికారుల హెచ్చరికలు. సారాంశంలో ఓటర్ మొదలుకొని అందరికందరూ పెత్తనం చలాయించే వారే. ఈసీకి ఇవి పట్టవు. 'సబ్ ఠీక్ హై' అంటోంది. గౌరవ ప్రదమైన జీవితం వెళ్లదీయదల్చుకున్నవారు ఉద్యోగాలు చేస్తారు. అందుకు జీతంతోపాటు గౌరవ మర్యాదలూ ఆశిస్తారు. కానీ అదనపు భారాలు మోపి, వెట్టి కార్మికుల కన్నా హీనంగా చూస్తూ, బెదిరింపులకు దిగటం వల్ల వారు సమాజంలో ఆత్మ గౌరవంతో బతకగలుగుతారా? పిల్లలను రేపటి పౌరులుగా తీర్చిదిద్దగలుగుతారా? గర్భిణులనూ, 45 ఏళ్లు దాటినవారినీ, అంగవైకల్యం ఉన్నవారినీ ఈ బాధ్యతల నుంచి తప్పించాలని గుజరాత్‌లో ఒక ఉపాధ్యాయ సంఘం కోరినా ఫలితం లేకపోయిందట! ఈ ధోరణి సరికాదు. దీన్ని వెంటనే చక్కదిద్దటం ఈసీ, కేంద్రం బాధ్యత.

# ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ పనితీరు అద్భుతం



అమరావతి,గత పాలకుల విధ్వంసంతో ఆగిపోయిన అమరావతి రాజధాని పనుల్ని ప్రధాని మోదీ పునఃప్రారంభించారని సిఎం చంద్రబాబు నాయుడు అన్నారు. రాజధాని నిర్మాణానికి 34 వేల ఎకరాలను త్యాగం చేసిన రైతులకు ధన్యవాదాలు. ప్రపంచంలో స్ఫూర్తిదాయకమైన ల్యాండ్ పూలింగ్ విధానంలో భూముల పొందిన ప్రాంతం అమరావతి అని గుర్తు చేశారు. రూ.15 వేల కోట్లను రాజధాని పునర్నిర్మాణానికి కేటాయించారు. రూ.1,334 కోట్లతో బ్యాంకులు, బీమా కంపెనీల ప్రధాన కార్యాలయాలు ఏర్పాటు చేయడం సంతోషదాయకం. బ్యాంకులు, బీమా కంపెనీల ఏర్పాటుతో 6,556 మందికి ఉద్యోగాలు కూడా వస్తాయన్నారు. ఫైనాన్షియల్ డిస్టిక్ట్ పేరిట బ్యాంకులు, ఆర్థిక సంస్థల కోసం అమరావతిలో స్థలం కేటాయించాం. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎల్ఐసీ, కెనరాబ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, ఐడీబీఐ, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ ఇండియన్ బ్యాంక్, యూనియన్ బ్యాంక్, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, పంజాబ్ నేషనల్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్, ఆప్కాబ్, నాబార్డ్, న్యూ ఇండియా అస్యూరెన్స్ కంపెనీ లిమిటెడ్ లు వచ్చాయని అన్నారు. సంస్థలన్నీ తమ ప్రధాన కార్యాలయాలను అద్భుతంగా నిర్మించాలని కోరుతున్నట్లు వెల్లడించారు. ప్రతీ ఇంట్లో మహిళలే ఆర్థిక మంత్రులు. మన దేశానికి కూడా మహిళా ఆర్థిక మంత్రే ఉన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టడంలో ఆమె అత్యంత కీలకంగా వ్యవహరిస్తున్నారు. దేశాన్ని ప్రధాన మంత్రి అగ్రస్థానానికి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తుం టే...ఆర్థికమంత్రి ఆదేస్థాయిలో సహకరిస్తున్నారు. జీఎస్టీ సంస్కరణలతో ఆర్థిక వ్యవస్థ పెరగటంతో పాటు సామాన్యులకూ లబ్ది కలిగిందని బాబు అన్నారు. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రోఫిజిక్స్ సంస్థ ఓ కాస్మోస్ ప్లానెటోరియం నిర్మాణానికి ఒప్పందం జరిగింది. ప్లానెటోరియం ఏర్పాటు చేసేందుకు అమరావతిలో స్థలం కూడా కేటాయించాం. ధ్వంసమైన ఆర్థిక వ్యవస్థ, గతంలో విభజన వల్ల జరిగిన నష్టాల నుంచి ఇప్పుడే గాడిన పడుతున్నాం. ఇంకా ఇబ్బందులు ఉన్నా అభివృద్ధి సాధించగలం అన్న విశ్వాసం మాకు ఉంది. త్వరలోనే సీడ్ యాక్సెస్ రహదారి కూడా పూర్తి అవుతుంది. 2028 కల్లా నిర్మాణాలు పూర్తి అవుతాయి. 7 జాతీయ రహదారులు, రైల్వేలైన్లు అమరావతికి కనెక్టు అవుతాయి. అమరావతి పూర్తిగా గ్రీన్, బ్లూ సిటీగా అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. భారతదేశం గర్వపడేలా అమరావతిని నిర్మాణం చేస్తాం. విట్,ఎస్ఆర్ఎం, బిట్స్ పిలానీ లాంటి ప్రతిష్టాత్మక సంస్థలు అమరావతికి వచ్చాయి. క్వాంటం వ్యాలీలో క్వాంటం కంప్యూటర్ కూడా ఏర్పాటు చేయబోతు న్నాం. ఫైనాన్షియల్ డిస్టిక్ట్ ద్వారా ఆర్థిక లావాదేవీలు పెద్ద ఎత్తున జరిగేలా ప్రణాళిక చేశాం. 2047కి భారత్ అగ్రస్థానంలో ఉంటుంది. అందులో ఏపీది కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. ఆశ వదులుకున్న పోలవరాన్ని మళ్లీ రీస్ట్రక్చర్ చేసేందుకు కేంద్రం సహకరించింది. రూ.400 కోట్లతో కట్టిన డయాఫ్రాం వాల్ ధ్వంసం అయితే మళ్లీ రూ.1,000 కోట్లు ఇచ్చి డయాఫ్రాం వాల్ నిర్మాణం చేసేందుకు నిధులిచ్చారు. 2027 నాటికి పోలవరం పూర్తి చేసి జాతికి అంకితం చేస్తాం. అలాగే 2028 నాటికి కూడా అమరావతి నిర్మాణాలు పూర్తి అవుతాయి. పరిశ్రమలు రాకుండా పారిపోయిన ఏపీకి మళ్లీ కూటమిపై భరోసాతో పెట్టుబడులు వస్తున్నాయి. రూ.1.37లక్షల కోట్ల పెట్టుబడులతో గూగుల్ విశాఖకు వస్తోంది. గోదావరి, కృష్ణా నదుల నుంచి వేల టీఎంసీల నీళ్లు సముద్రంలో వృధాగా కలుస్తున్నాయి. పోలవరం నుంచి నల్లమల సాగర్ లింక్ ద్వారా నీళ్లు తీసుకెళ్తే రాయలసీమ సస్యశ్యామలం అవుతుంది. సముద్రంలోకి వెళ్లే మిగులు జలాలు వాడుకుని దేశసంపద పెంచేలా రాయలసీమకు నీళ్లు పారించాలని భావిస్తున్నాం అని వివరించారు. ఈ ప్రాజెక్టుకు నిధులు ఇచ్చి ఆదుకోవాలని ఆర్థిక మంత్రికి విజ్ఞప్తి చేస్తున్నాను. రాయలసీమను హార్టికల్చర్ హబ్ గా తీర్చిదిద్దటంలో ఈ నీరు కీలకం అవుతుంది. ఆ ప్రాంతం అభివృద్ధి అవుతుంది. పూర్వోదయ ప్రాజెక్టు కింద ఉదారంగా నిధులు ఇస్తే రాయలసీమ, ఉత్తరాంధ్ర, మిగిలిన ప్రాంతాలు అభివృద్ధి అవుతాయి. కేంద్ర సహకారం వల్ల చాలా వరకూ రాష్ట్రం రికవర్

# అవసరం మేరకు కేటాయింపులు

అమరావతి,రాజధాని బ్యాకుల శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ..గత పాలకుల వల్ల ఐసీయూలో ఉన్న రాష్ట్రాన్ని ఆదుకునేందుకు కేంద్రం ఆక్సిజన్ అందించిందన్నారు. దీనికి రాష్ట్ర ప్రజల తరపున కేంద్రానికి ధన్యవాదాలు తెలియచేస్తున్నాం. బ్యాంకుల ప్రధాన కార్యాలయాలతో దేశ ఆర్థిక వ్యవస్థ అంతా ఏపీకి వచ్చినట్టు ఉంది. ఆర్థిక వనరుల విషయంలో ఆమె కాస్త కఠినంగానే ఉంటారు. మన ఇంట్లో అమ్మలాగే ఎప్పుడు ఏది అవసరమో, అప్పుడే నిధులు ఇస్తారు. ఇంత పెద్ద భారతదేశంలో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థను నిర్వహించటం మాటలు కాదు. మా రాజకీయ హెడ్ మాస్టర్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా ఫలితాలు సాధించే విషయంలో కఠినంగానే ఉంటారు. అందుకే ప్రతిఫలాలు ప్రజలకు అందిస్తున్నారని పయ్యావుల అన్నారు. డబుల్ ఇంజన్ సర్కార్ కు ఇంధనం-ధనమే. వందేభారత్ రైళ్లు, డిఫెన్స్ సెక్టార్, విద్య, వైద్య రంగాల్లో నిధుల కేటాయింపు పెరుగుతోంది. దేశం గుర్తు పెట్టుకునేలా కేంద్ర ఆర్థిక మంత్రి సేవలు అందిస్తున్నారు. జీఎస్టీ సంస్కరణల ప్రకటించినప్పుడు అత్యంత వేగంగా దానిని దేశవ్యాప్తంగా అమలు చేయటం ఆశ్చర్యపరిచింది. పోలవరం, అమరావతి రాజధాని నిర్మాణానికి, విశాఖ ఉక్కుకు ఆర్థిక సహకారం కేంద్రం అందిస్తోందని ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు . కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ 8 మార్లు ఆర్థిక మంత్రిగా బ్జడెట్లు ప్రవేశపెట్టిన చరిత్ర సాధించారు నిర్మలా సీతారామన్. పబ్లిక్ సెక్టార్ బ్యాంకులను విలీనం చేసి ఖాయిలా ప్రమాదం నుంచి వాటిని కాపాడారు ఆమె. కొత్తగా రాజకీయాల్లోకి వచ్చిన వారికి నిర్మలాసీతారామన్ స్ఫూర్తి. 34 వేల ఎకరాలను రైతులు రాజధాని కోసం త్యాగం చేశారు. అమరావతి అంటే ఆంధ్రుల ఆత్మవిశ్వాసం, రాష్ట్ర భవిష్యత్ కల అన్నారు. రాజధానిలో ప్రభుత్వ రంగ బ్యాంకులు, బీమా కంపెనీల ప్రధాన కార్యాలయాలకు శంకుస్థాపన చేసారు కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ , ముఖ్యమంత్రి చంద్రబాబు. మొత్తం 15 బ్యాంకులు, బీమా సంస్థల ప్రధాన కార్యాలయాలకు శంకుస్థాపన చేసారు. ఆయా బ్యాంకుల చైర్మన్లు, సీఎండీలు ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# కొత్తగా ఉందా?

హైదరాబాద్, ఎంతో ప్రతిష్టాత్మకంగా జరిగిన ఎన్నిక. అధికార పార్టీ క్యాండిడేట్‌గా గెలిచిన ఎమ్మెల్యే. నవీన్ యాదవ్ విజయం కోసం మంత్రులు, ఎమ్మెల్యేలు ఇంచార్జ్‌లుగా బాధ్యతలు తీసుకుని పనిచేసిన ప్రత్యేక పరిస్థితి. కానీ ఎమ్మెల్యేగా ఆయన ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమానికి మాత్రం..ఇద్దరు మంత్రులు మినహా అమాత్యులెవరూ పాల్గొనలేదు. చివరకు పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ కూడా ఎమ్మెల్యే ప్రమాణస్వీకారానికి దూరంగా ఉండిపోయారు. మంత్రులందరికీ ఆహ్వానం అందినా మినిస్టర్లు కార్యక్రమానికి రాకపోవడంపై చర్చ జరుగుతోంది. పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు నగరంలో ఉన్నా ప్రమాణస్వీకారోత్సవానికి డుమ్మా కొట్టడంపై హస్తం పార్టీలో గుసగుసలు మొదలయ్యాయి. జూబ్లీహిల్స్ ఉపఎన్నిక బాధ్యతలను మొదట్లో కాంగ్రెస్ పార్టీ ముగ్గురు మంత్రులపై పెట్టింది. మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు, వివేక్ వెంకటస్వామిని ఉప ఎన్నికకు దాదాపు మూడు నెలల ముందే ఇంచార్జీలుగా నియమించారు. ఈ ముగ్గురు మంత్రులు ఉప ఎన్నిక విజయం కోసం తీవ్రంగా కష్టపడ్డారు. తమ నియోజకవర్గ ఎన్నిక కంటే ఎక్కువగానే ముగ్గురు మంత్రులు పని చేశారు. అయితే ఈ ముగ్గురు మంత్రులు నవీన్ యాదవ్ ప్రమాణ స్వీకారానికి హాజరు కాకపోవడంతో పార్టీలో జోరుగా చర్చ జరుగుతోంది. హైదరాబాద్‌లో ఉండి ముగ్గురు మంత్రులు ప్రమాణస్వీకారంలో పాల్గొనకపోవడంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ప్రభుత్వ కార్యక్రమాలు ఉండటం వల్లే ప్రమాణ స్వీకారానికి రాలేదని మంత్రులు చెబుతున్నా..ఆ ముగ్గురు అమాత్యులు ఎక్కడో ఫీలయ్యారన్న టాక్ నడుస్తోంది. మరోవైపు పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ కూడా నవీన్ యాదవ్ ప్రమాణ స్వీకారానికి హాజరు కాలేదు. మహేష్ గౌడ్ పీసీసీ బాధ్యతలు చేపట్టిన తర్వాత జరిగిన మొదటి ఎన్నిక ఇది. బీసీ వర్గానికి చెందిన నవీన్ యాదవ్ ఓథింగ్ సెర్మనీలో మహేష్ గౌడ్ పాల్గొనకపోవడంపై కాంగ్రెస్ వర్గాల్లో చర్చకు దారి తీసింది.

గెలిచిన తర్వాత వారిని కలవలేదా?

నవీన్ యాదవ్ ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత.. తన గెలుపు కోసం పనిచేసిన అందరినీ కలిసి థ్యాంక్స్ చెప్పారు. కానీ మూడు నెలలుగా పనిచేసిన ముగ్గురు మంత్రులను.. ముందుగా వెళ్లి కనీస మర్యాదగా కలవలేదట. మంత్రులలో కూడా అందరినీ కలిసిన తర్వాత ఈ ముగ్గురి దగ్గరికి వెళ్లారట. దీంతో సదరు మంత్రులు హర్ట్ అయినట్లు టాక్. అందుకే పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వర్‌రావు, వివేక్ వెంకటస్వామిలు హైదరాబాద్‌లో ఉండి కూడా నవీన్ ప్రమాణస్వీకారోత్సవానికి దూరంగా ఉండిపోయారట. ఇక పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ కూడా కాస్త అసంతృప్తిగానే ఉన్నారనే టాక్ వినిపిస్తోంది. నవీన్ గెలిచిన తర్వాత పీసీసీ చీఫ్‌ను ఇంటికి వెళ్లి కర్టసీగా కలవలేదట. ఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఓవైసీ, టీజేఎస్ అధ్యక్షుడు కోదండరామ్ ఆఫీస్‌కు వెళ్లి కలిశారు కానీ..పీసీసీ చీఫ్ దగ్గరకు స్వయంగా వెళ్లలేదట. ఇక ప్రమాణస్వీకార కార్యక్రమానికి ఆహ్వానించే విషయంలో కూడా నవీన్ యాదవ్ చిన్నచిన్న పొరపాట్లు చేసినట్లు సమాచారం. రీజన్స్ ఏవైనా పలువురు మంత్రులు, కీలక నేతలు అలకబూని ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరు కాలేదని గుసగుసలు వినిపిస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీని..హస్తం పార్టీ లీడర్లను అర్థం చేసుకోవడంలో నవీన్ యాదవ్ ఇబ్బంది పడుతున్నారని..దాన్ని సరిచేసుకోకుంటే ఫ్యూచర్‌లో మరింత కష్టమవుతుందని చర్చించుకుంటున్నారు కాంగ్రెస్ నేతలు.

# రైతుల త్యాగం..అమరావతి

అమరావతి,దేవతల రాజధాని.. రైతుల త్యాగం.. అమరావతి అని మంత్రి నారా లోకేష్ అన్నారు. అమరావతిలో బ్యాంకుల కార్యాలయాల నిర్మాణాలకు శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం విధ్వంసం చేయాలని చూసిందని ఆరోపించారు. మూడు రాజధానులని చెప్పి ఒక్క ఇటుక కూడా వేయలేదని విమర్శించారు. ఒక్క వ్యక్తి నివాసానికి రూ.700 కోట్లు పెట్టి విశాఖలో ప్యాలెస్ కట్టారని ఎద్దేవా చేశారు. ఎన్ని ఇబ్బందులు పెట్టినా జై అమరావతి నినాదంతో ముందుకెళ్లామన్నారు. ఒకే రాష్ట్రం.. ఒకే రాజధాని అని ఆనాడు పోరాటం చేశామన్నారు. జై అమరావతి అన్నందుకు రైతులపై కేసులు పెట్టారు అని తెలిపారు. 1631 రోజులు అమరావతి ఉద్యమం నడిచింది. 270 మంది రైతులు ప్రాణాలు కోల్పోవడం చూశాం. సుమారుగా 3 వేల మంది రైతులపై ఆనాడు కేసులు పెట్టారు. రాజధాని కోసం స్వచ్ఛందంగా రైతులు భూములు ఇచ్చారు. కూటమి ప్రభుత్వంలో అమరావతి పనులు వేగంగా సాగుతున్నాయి. స్త్రీ శక్తి అంటే నాకు గుర్తొచ్చే మొదటి వ్యక్తి నిర్మలా సీతారామన్. ఆమె పార్లమెంటులో ప్రతిపక్ష సభ్యులకు సరైన సమాధానం చెబుతారు. వరుసగా 8 కేంద్ర బడ్జెట్‌లు ప్రవేశపెట్టారు. ఆమె జీవితం మనకు ఒక పాఠం అని లోకేశ్ అన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక మళ్లీ పనులు పునఃప్రారంభించి జెట్ స్పీడ్ లో నిర్మాణాలు జరుగుతున్నాయి. ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ సింప్లిసిటీకి హ్యాట్సాఫ్ మంగళగిరి చేనేత వస్త్రాలను ధరించి ప్రమోట్ చేసినందుకు ఆమెకు ధన్యవాదాలు. ఏపీ ఏ సాయం కోరినా ఆర్థిక మంత్రి సహకారం అందిస్తున్నారు.

## ఆ ఎమ్మెల్యేలపై డేగ కన్ను.. టీడీపీ కీలక నిర్ణయం ..!



అమరావతి,ఒకరు కాదు .. ఇద్దరు కాదు.. ఏకంగా 25 మంది ఎమ్మెల్యేలపై టీడీపీ దృష్టి పెట్టింది. సదరు నేతలు ఏం చేస్తున్నారు? ఎలాంటి కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు? అనే విషయాలపై ప్రత్యేకంగా ఆరా తీస్తోంది. అంతేకాదు.. జిల్లా ఇంచార్జ్‌లు, నియోజకవర్గ బాధ్యులకు, ఇంచార్జ్ మంత్రులకు కూడా కొన్ని కొన్ని బాధ్య తలు అప్పగించారు. ఉమ్మడి అనంతపురం, కర్నూలు, కృష్ణా సహా పలుజిల్లాలు ఈ జాబితాలో ఉన్నాయి. అత్యంత విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు.. సదరు ఎమ్మెల్యేలపై డేగకన్ను సారించారని తెలిసింది.

**ఎందుకు?**

ప్రధానంగా 4 విషయాలకు సంబంధించి టీడీపీ నేతలపై అధిష్టానం అసంతృప్తితో ఉంది. ఆయా విష యాలపై చంద్రబాబు ఎప్పటికప్పుడు హెచ్చరిస్తున్నారు. నాయకులు తమను తాము సరిదిద్దు కోవాలని కూడా చెబుతున్నారు. అయితే.. ఇంకా 25 మంది ఎమ్మెల్యేలు..తమను తాము నియంత్రించుకునే విష యంలోను, తమను తాము సరిదిద్దుకునే విషయంలోనూ ఎక్కడా ముందుకు రావడం లేదు. దీంతో ఆయా ఎమ్మెల్యేల విషయంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టారు.

**ఇవీ అంశాలు..**

1) ప్రజల మధ్య లేకపోవడం: ఎమ్మెల్యేలు ప్రజల మధ్య ఉండాలని పార్టీ అధినేత చంద్రబాబు పదే పదే చెబుతున్నారు. ప్రజాదర్బార్‌లు నిర్వహించి.. సమస్యలు తెలుసుకుని పరిష్కరించే ప్రయత్నం చేయాలని కోరుతున్నారు. కానీ, ఇప్పటికీ చాలా మంది ఆ పనిచేయడం లేదు.

2) 1వ తారీకు ఇచ్చే పింఛను కార్యక్రమం: ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు పాల్గొనాలని సీఎం చంద్రబాబు చెబుతున్నారు. అయితే.. కొందరు ఎమ్మెల్యేలు పెద్దగా ఈ విషయంలో జోక్యం చేసుకోవడం లేదు. ఫలి తంగా సచివాలయ సిబ్బందిమాత్రమే ఇంటింటికీ వెళ్లి ఇస్తున్నారు. దీనివల్ల ప్రజలతో కనెక్ట్ కావడం లేదన్న విమర్శలు వస్తున్నాయి.

3) స్థానికంగా లేకపోవడం: కొందరు ఎమ్మెల్యేలు తమ తమ నియోజకవర్గాల్లో ఉండడం లేదు. ఈ విష యాన్ని సీఎం చంద్రబాబు ఇటీవల కూడా చెప్పారు. నియోజకవర్గాలను వదిలేసి.. హైదరాబాద్‌లో తిష్ఠ వేస్తున్నారని.. ఇది సరైన విధానం కాదని ఆయన హెచ్చరించారు.

4) వ్యాపారాలు: కొందరు ఎమ్మెల్యేలు.. వ్యాపారాలు, వ్యవహారాల్లోనే తీరిక లేకుండా ఉంటున్నారు. ఇలా.. అనేక అంశాలను పరిగణనలోకి తీసుకున్న పార్టీ నాయకత్వం పార్టీ విధానాలకు.. అధిష్టానం సూచనలకు భిన్నంగా వ్యవహరిస్తున్నవారిని నియంత్రించేందుకు చర్యలు చేపట్టనుంది.

## నో పాలిటిక్స్ అంటూనే విజయసాయి ట్విస్టులు..

అమరావతి,రాజకీయాలకు గుడ్‌బై..ఇక నుంచి వ్యవసాయం చేసుకుంటానని చెప్పిన మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి..రూట్ మార్చినట్లు కనిపిస్తోంది. పాలిటిక్స్‌కు గుడ్‌బై చెప్పి ఏడాది కాకముందే ఎప్పుడూ ఏదో ఒక స్టేట్‌మెంట్ ఇస్తూ..ఆసక్తికర ట్వీట్స్ చేస్తూ పొలిటికల్ హాట్ టాపిక్‌గా కొనసాగుతున్నారు. ఇప్పుడేమో ఏ పార్టీలో చేరే ఆలోచన లేదంటారు. మరోసారి అవసరమైతే కొత్త పార్టీ పెడతా అంటారు. తన అవసరం ఉందనుకుంటే రాజకీయాల్లోకి వస్తానంటారు.

**పవన్ ని పావలా అన్న విషయం మర్చిపోయారా?**

అసలు ఈ పొంతన లేని స్టేట్‌మెంట్స్ ఎందుకన్న చర్చ జరుగుతోంది. శ్రీకాకుళం జిల్లాలో జరిగిన ఓ కార్యక్రమంలో విజయసాయిరెడ్డి పాల్గొన్నారు. ఎప్పటిలాగే..జగన్ కోటరీ అంటూ డైలాగులు పేల్చారు. పవన్‌ను పొగిడేందుకు ప్రయత్నించారు. తనకు ఆయనతో 20 ఏళ్ల స్నేహం ఉందని గుర్తు చేసుకున్నారు. ఆయనను తాను ఎప్పుడూ ఒక్క మాట కూడా అనలేదని.. భవిష్యత్‌లో కూడా అనననని చెప్పారు. కానీ గతంలో పవన్‌ను పావలా అని.. విమర్శించిన విషయాన్ని ఆయన మర్చిపోయారంటూ సోషల్ మీడియాలో మీమ్స్ వస్తున్నాయ్.

**జగన్‌కు బ్యాక్ బోన్ లాంటి వాడు..!**

ఎప్పటికప్పుడు సమ్‌థింగ్ డిఫరెంట్ అన్నట్లుగా కామెంట్స్ చేస్తూ వస్తున్నారు విజయసాయిరెడ్డి. మొన్నటివరకు రాజకీయాలకు దూరంగా ఉన్నట్లుగా..పబ్లిక్ వాయిస్‌గా ట్వీట్స్ చేస్తూ చర్చకు దారితీశారు. ఇప్పుడేమో తన అవసరమైతే మళ్లీ పాలిటిక్స్‌లోకి వస్తానంటున్నారు.

ఆయన అవసరం పబ్లిక్‌కు ఉందా? లేక ఆయనకే రాజకీయాలు తప్పనిసరిగా మారాయా అన్నది ఇక్కడ పాయింట్. విజయసాయిరెడ్డి అవసరం వైసీపీకి ఉండొచ్చు. ఎందుకంటే గతంలో ఆ పార్టీలో నెంబర్.2గా పనిచేశారు. తెరవెనుక రాజకీయాలు చక్కబెట్టడంలో జగన్‌కు సాయిరెడ్డి బ్యాక్ బోన్ లాంటి వాడని చెప్తుంటారు. అలాంటి విజయసాయిరెడ్డి వైసీపీని వీడినప్పటి నుంచి జగన్ కోటరీని టార్గెట్ చేస్తున్నారు.కోటరీ వల్లే తాను జగన్‌కు దూరమయ్యాను..జగన్‌ను మిస్ అవుతున్నాను అన్నట్లుగా మాట్లాడుతున్నారు విజయసాయిరెడ్డి. తన విషయంలో జగన్ కోటరీ ఆయనను పూర్తిగా డైవర్ట్ చేస్తోందని..అలాంటి వారి మాటలు వినరాదని, అన్నీ ఆలోచించాలని జగన్‌కు సూచించారు. అంటే జగన్ మంచిని కోరుకుంటున్నాను అన్నట్లుగా చెప్పుకొచ్చారు



విజయసాయిరెడ్డి.విజయసాయిరెడ్డి మాజీ ఎంపీ మాత్రమే కాదు..మాజీ వైసీపీ నేత, జగన్‌కు అత్యంత సన్నిహితుడు కూడా. ఆయన ఏం మాట్లాడినా పొలిటికల్ యాంగిల్ వెతకడం, దాన్ని హైలెట్ చేయడం కామన్. ఈ నేపథ్యంలోనే లేటెస్ట్‌గా విజయసాయిరెడ్డి చేసిన కామెంట్స్ పొలిటికల్ ఇంట్రెస్టింగ్‌గా మారాయి. సాయిరెడ్డి మనసు వైసీపీ వైపు లాగుతుందన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. ఏదో ఒక ఫైన్ మార్నింగ్ విజయసాయిరెడ్డి వైసీపీలో చేరిక ప్రకటన రావొచ్చన్న ఊహాగానాలు ఉండే ఉన్నాయి. కూటమి అధికారంలోకి వచ్చి 18 నెలలు కావొస్తోంది. వైసీపీ అధినేత జగన్ పార్టీ బలోపేతం కోసం నియోజకవర్గాల్లో పార్టీ వ్యవహారాలను చక్కబెడుతూ వస్తున్నారు. పార్టీకి దూరమైన నేతలను దగ్గర చేసే ప్రయత్నాల్లో పడ్డారు.

**విజయసాయి తిరిగి వైసీపీ గూటికి?**

మొన్నా మధ్య పార్టీని విడిచి వెళ్లిపోయిన నేతలు తిరిగి పార్టీలోకి రావొచ్చు..నో అబ్జక్షన్స్ అంటూ వైసీపీ ఇంటర్నల్ మీటింగ్‌లో ఓపెన్ ఆఫర్ ఇచ్చారు జగన్. ఈ క్రమంలోనే విజయసాయిరెడ్డి తిరిగి వైసీపీ గూటికి చేరతారని పెద్దఎత్తున ప్రచారం కూడా నడిచింది. అయితే జగన్ నుంచే పిలుపు రావాలని విజయసాయిరెడ్డి ఎదురుచూస్తున్నట్లు ఇన్ సైడ్ టాక్. ఇది ఎంతవరకు నిజమో తెలియదు కానీ..వ్యవసాయం చేసుకుంటానని చెప్పి..విజయసాయిరెడ్డి తరచూ రాజకీయాలు..పొలిటికల్ రీఎంట్రీపై మాట్లాడుతుండటం మాత్రం ఆయనలో ఉన్న పొలిటికల్ ఇంట్రెస్ట్‌ను స్పష్టం చేస్తోంది. రాబోయే రోజుల్లో విజయసాయిరెడ్డి రాజకీయ అడుగులు ఎటువైపు పడతాయో చూడాలి.

## కెసిఆర్ దొంగదీక్షలతో తెలంగాణ రాలె

హైదరాబాద్,తెలంగాణ ఉద్యమ సమయంలో మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేసిన దీక్ష కారణంగానే తెలంగాణ రాలేదని టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ అధినేత్రి సోనియా తీసుకున్న నిర్ణయం వల్లనే తెలంగాణ సాకారమయ్యిందన్నారు. అంతేగానీ కెసిఆర్ దొంగ దీక్షలతో కాదని సంచలన వ్యాఖ్యలు చేశారు. శుక్రవారంఆయన మీడియాతో మాట్లాడుతూ.. కేసీఆర్ వల్ల తెలంగాణ రాలేదన్నారు. దీక్ష పేరుతో కేసీఆర్ ఎనిమిది రోజులు ఫ్లూయిడ్స్ తీసుకున్నారని.. దీక్ష పేరుతో కేసీఆర్ నాటకం చేశారని ఆరోపించారు. కేసీఆర్ దీక్ష చేసిన సమయంలో డాక్టర్స్ ఇచ్చిన రిపోర్టులను కేటీఆర్‌కు పంపుతామని పీసీసీ చీఫ్ అన్నారు. కేసీఆర్ దీక్షతో తెలంగాణకు వచ్చింది ఏంటని ప్రశ్నించారు. తెలంగాణ ఉద్యమంలో చనిపోయింది ఎస్సీ, ఎస్టీ, బీసీ బిడ్డలని తెలిపారు. కేసీఆర్ దీక్ష విరమిస్తే విద్యార్థు లు పోరాటాన్ని కొనసాగించారని అప్పటి సంగతులను గుర్తుచేశారు. విద్యార్థుల ఆవేదన చూసి సోనియా గాంధీ తెలంగాణ ఇచ్చారని తెలిపారు. కిరోసిన్ పోసుకున్న హరీష్ రావుకి అగ్గిపెట్టె దొరకలేదా అని ప్రశ్నించారు. ఫ్లూయిడ్స్ తీసుకుని ఐరోమ్ షర్మిల 16 ఏండ్లు దీక్ష చేశారన్నారు. ఉనికి కోల్పోయిన బీఆర్ఎస్ కోట్లాది రూపాయలతో దీక్షా దివాస్ చేస్తోందని విమర్శించారు. తెలంగాణ కోసం దీక్ష చేసినట్లు కేసీఆర్ నాటకం ఆడారని.. ఇప్పుడు దీక్షా దివాస్ పేరుతో మళ్ళీ సెంటిమెంట్ రగిల్చే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. దీక్షా దివాస్‌ను పక్కన పెట్టి సోనియా గాంధీకి పాలాభిషేకాలు చేయాలని హితవుపలికారు. తెలంగాణలో కేసీఆర్, ఆయన పార్టీకి నూకలు చెల్లిపోయాయని భావిస్తున్నారన్నారు. బీఆర్ఎస్ పార్టీ ముగిసిన అధ్యాయమని కేసీఆర్‌కు అర్థమైందని.. అందుకే ఆయన బయటకు రావడం లేదంటూ కామెంట్స్ చేశారు. బీసీ రిజర్వేషన్ల పెంపు అంశంపై మహేష్ గౌడ్ స్పందిస్తూ.. బీసీ రిజర్వేషన్ల పెంపుపై కోర్టుకు వెళ్తామన్నారు. ఇంద్రా సహానీ, కృష్ణమూర్తి కేసులను ఛాలెంజ్ చేస్తామని చెప్పారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చే అంశం ముగిసిపోలేదని



స్పష్టం చేశారు. రిజర్వేషన్ల పెంపు కోసం బీజేపీ అడ్డు పడుతోందని ఆరోపించారు. ఈ విషయంపై బీసీ నాయకులు.. బీజేపీ, బీఆర్ఎస్ నాయకుల ఇండ్లకు వెళ్ళి ప్రశ్నించాలని కోరారు. పార్లమెంట్ సమావేశాల్లో బీసీ రిజర్వేషన్ల అంశంపై మాట్లాడాలని ఎంపీలకు విన్నవించినట్లు తెలిపారు. హిడ్మా, గణపతి ప్రజాసేవ కోసం త్యాగం చేశాని పీసీసీ చీఫ్ అన్నారు. లొంగిపోదామని వచ్చే మావోయిస్టు లకు అవకాశం ఇవ్వాలన్నారు. లొంగిపోదాం అనుకునే మావోయిస్టులు తెలంగాణకు రావచ్చని పిలుపునిచ్చారు. ఆర్ఎస్ఎస్ వాళ్లు మతం పేరుతో విషం నింపుతున్నారని మండిపడ్డారు. మతాల పేరుతో చిచ్చు పెట్టినన్ని రోజులు ఇండియా ముందుకు పోదని పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ వ్యాఖ్యలు చేశారు.

### ఉడుపితో అనుబంధం విడదీయరానిది

బెంగళూరు,ఉడుపి రావడం తనకు చాలా ప్రత్యేకమైంది అని ప్రధాని మోడీ అన్నారు. కర్ణాటకలోని ఉడుపిలో మోడీ పర్యటించారు. అంతకముందు భారీ ర్యాలీ నిర్వహించారు. రోడ్డుకు ఇరువైపుల నుంచి ప్రజలు పూల వర్షం కురిపించారు. అనంతరం ఉడుపిలోని ప్రసిద్ధ శ్రీకృష్ణ మఠానికి వచ్చారు. ఈ సందర్భంగా లక్ష కంఠ భగవద్గీత పఠనంలో పాల్గొన్నారు.

## ఈసారి గెలిచి తీరాల్సిందే..!



హైదరాబాద్, ఈసారి మునుపటి లెక్క కాదు. కంటోన్మెంట్ చేజారింది.. జూబ్లీహిల్స్ మిస్ అయ్యింది. ఆ రెండు సిట్టింగ్ సీట్లలో సెంటిమెంట్ వర్కవుట్ కాలేదు. ఖైరతాబాద్ బై ఎలక్షన్ వస్తే మాత్రం ఎట్టి పరిస్థితుల్లో గెలిచి తీరాల్సిందేనని పట్టుదలతో ఉంది బీఆర్ఎస్. ఇక చేజారిన జూబ్లీహిల్స్ పక్కనే ఉన్న ఖైరతాబాద్‌కు కూడా ఉప ఎన్నిక ఖాయమన్న ప్రచారం ఊపందుకుంది. పార్టీ ఫిరాయింపుల ఎపిసోడ్‌లో ఖైరతారాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై అనర్హత వేటు తప్పదన్న చర్చ జరుగుతోంది. దానంపై వేటు పడటమో లేక అంతకంటే ముందే ఆయన రిజైన్ చేయడమో? ఏదో ఒకటి పక్కా అని టాక్ వినిపిస్తోంది.జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఓటమితో తీవ్ర నిరాశలో ఉన్న బీఆర్ఎస్..కచ్చితంగా ఖైరతాబాద్‌లో గెలిచి తీరాలన్న కసితో ఉంది. అందుకోసం ఇప్పటి నుంచే కసరత్తు స్పీడప్ చేసింది. బలమైన అభ్యర్థి కోసం గులాబీ పార్టీ వేట మొదలుపెట్టింది. అధికార కాంగ్రెస్ నుంచి మళ్లీ దానం నాగేందర్ పోటీ చేస్తే ఒకలా..లేదంటే మరోలా రెండు ప్లాన్స్ రెడీ చేస్తోంది గులాబీదళం. దివంగత నేత పీజేఆర్‌కు ఖైరతాబాద్ లో అభిమానులు ఉండటంతో..ఆయన తనయుడు, జూబ్లీహిల్స్ మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్ ను రంగంలోకి దించాలని అనుకుంటోందట బీఆర్ఎస్.

**పీజేఆర్ తనయుడిగా ఫాలోయింగ్..**

ఒకసారి ఖైరతాబాద్ నుంచి, నియోజకవర్గాల పునర్విభజన తర్వాత జూబ్లీహిల్స్ నుంచి మరోసారి ఎమ్మెల్యేగా గెలుపొందిన విష్ణు..2023లో టికెట్ దక్కకపోవడంతో కారెక్కారు. మొన్న జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో విష్ణు టికెట్ ఆశించినా..మాగంటి గోపీనాథ్ భార్య సునీతనే పోటీలో పెట్టారు గులాబీ బాస్ కేసీఆర్. కాబట్టి ఇప్పుడు ఖైరతాబాద్ ఉపఎన్నిక వస్తే విష్ణును పోటీ చేయిస్తే..పీజేఆర్ తనయుడిగా ఇప్పటికే ఆయనకున్న ఫాలోయింగ్‌తో ఖైరతాబాద్ లో దానం నాగేందర్‌కు గట్టి పోటీ ఇస్తాడని నమ్ముతోంది గులాబీ పార్టీ.

**టికెట్ రేసులో మన్నె, దాసోజు..?**

ఇదే సమయంలో బీఆర్ఎస్ లో ఖైరతాబాద్ టికెట్ ను పలువురు ఆశిస్తున్నారు. ఖైరతాబాద్ నియోజకవర్గం నుంచి 2014లో ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిన మన్నె గోవర్ధన్ రెడ్డి తనకే అవకాశం ఇవ్వాలని కోరుతున్నారట. ఒకవేళ తనకు టికెట్ ఇవ్వకపోతే తన భార్య మన్నె కవితకు ఛాన్స్ ఇవ్వాలని అడుగుతున్నారు. ప్రస్తుతం ఖైరతాబాద్ పరిధిలోని వెంకటేశ్వర కాలనీ జీహెచ్ఎంసీ కార్పొరేటర్ గా ఉన్నారు మన్నె కవిత. 2018, 2023 రెండుసార్లు బీఆర్ఎస్ దానం నాగేందర్‌కు టికెట్ ఇస్తే సీటు త్యాగం చేసి సహకరించానని..ఈసారి తనకు, లేకపోతే తన భార్య మన్నె కవితకు టికెట్ ఇవ్వాలని పట్టుబడుతున్నారట మన్నె గోవర్ధన్‌రెడ్డి.మరోవైపు ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ కూడా గతంలో ఖైరతాబాద్ నుంచి పోటీ చేశారు. బీసీ ఈక్వేషన్‌లో దాసోజు పేరు కూడా బీఆర్ఎస్ పరిశీలిస్తోంది. వీరితో పాటు మరికొందరు నేతలు ఖైరతాబాద్ బీఆర్ఎస్ టికెట్ రేసులో ఉన్నారని..పార్టీ ముందు తమ ప్రతిపాదన పెట్టారని అంటున్నారు. దీంతో ఖైరతాబాద్ నుంచి ఎవరిని బరిలోకి దింపాలని బీఆర్ఎస్ ఆలోచనలో పడింది. జూబ్లీహిల్స్ మాదిరి కాకుండా ఈసారి ఖైరతాబాద్ లో కచ్చితంగా గెలిచి తీరాలన్న పట్టుదలతో ఉన్న గులాబీ పార్టీ..బలమైన అభ్యర్థి కోసం వడపోస్తోందట.

## పంచాయితీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ లో కొత్త రచ్చ..



హైదరాబాద్, తెలంగాణ కాంగ్రెస్‌లో జిల్లా అధ్యక్షుల ప్రకటన అసంతృప్తికి ఆజ్యం పోస్తోంది. డీసీసీ పీఠం ఆశించి భంగపడ్డ నేతలంతా పార్టీ ముఖ్యనేతల తీరుపై రుసరుసలాడుతున్నారు. పార్టీని నమ్ముకుని పని చేస్తే ఇదా మాకు మీరిచ్చే గౌరవం అంటూ తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. కొన్ని ముఖ్యమైన సామాజిక వర్గాలను పక్కన పెట్టడం చర్చకు దారితీస్తోంది. పొలిటికల్ పార్టీలలో సామాజిక సమీకరణాలు చాలా కీలకం. అలాంటిది ఉత్తర తెలంగాణలో రాజకీయంగా చైతన్యం కలిగిన.. వెలమ సామాజిక వర్గానికి ఈసారి ఒక్క డీసీసీ కూడా దక్కకపోవడంపై చర్చ జరుగుతుంది. మొన్నటి వరకు నాలుగు జిల్లాలకు అంటే..వరంగల్, నిర్మల్, మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల డీసీసీ అధ్యక్షులు వెలమ సామాజికవర్గానికి చెందిన వారు ఉండే వారు. కానీ ఈసారి ఒక్క డీసీసీ పీఠం కూడా వెలమ వర్గానికి దక్కకపోవడంతో ఆ సామాజిక వర్గం నేతలు అసంతృప్తితో వ్యక్తం చేస్తున్నారు.ఉమ్మడి వరంగల్ జిల్లాలో జనగామ, మహబూబాబాద్ డీసీసీల ఎంపికపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం అవుతోంది. జనగామ డీసీసీ పోస్ట్‌ను గత ఎన్నికల్లో జనగామ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన కొమ్మూరి ప్రతాప్ రెడ్డి, పాలకుర్తి నియోజకవర్గ ఇంఛార్జి ఝాన్సీరెడ్డి ఆశించారు. వీరిద్దరికి కాకుండా కొంతకాలంగా పాలిటిక్స్‌కు దూరంగా ఉంటున్న లకావత్ ధన్వంతికి జనగామ డీసీసీ ప్రెసిడెంట్ పోస్ట్ ఇవ్వడంపై కొందరు నేతలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇక మహబూబాబాద్ డీసీసీ ఆశించిన వెన్నం శ్రీకాంత్ రెడ్డికి కాకుండా మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీనాయక్ భార్య భూక్య ఉమాకు డీసీసీ అధ్యక్ష పదవి ఇవ్వడంపై వెన్నం వర్గం రగిలిపోతోంది.ఇక ఉమ్మడి కరీంనగర్‌లోని జగిత్యాల డీసీసీ పోస్ట్‌ను బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యే సంజయ్ తన వర్గానికి ఇప్పించుకోవాలనుకున్నారు. తన మద్దతు కూడా జువ్వాడి నర్సింగారావుకి ప్రకటించారు. కానీ మాజీమంత్రి జీవన్ రెడ్డి తన సీనియారిటీ అంతా ఉపయోగించి తన అనుచరుడు నందయ్యకు ఇప్పించుకున్నారు. దీంతో అటు సంజయ్..ఇటు జువ్వాడి ఇద్దరూ హర్ట్ అయినట్లు ప్రచారం జరుగుతోంది. పీసీసీ పెద్దల దగ్గర తన ఆవేదన వెళ్లగక్కారట ఎమ్మెల్యే సంజయ్.

**స్వయంగా మంత్రి చెప్పినా నో యూజ్?**

ఇక కరీంనగర్ డీసీసీ పదవిని కరీంనగర్ పార్లమెంట్ నుంచి పోటీ చేసిన వెలిచాల రాజేందర్ ఆశించారు. అయితే చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు డీసీసీ పోస్ట్ ఇచ్చారు. ఎమ్మెల్యేలకు డీసీసీలుగా అవకాశం ఇవ్వము అని చెప్పి ఇప్పుడెలా ఇచ్చారని ప్రశ్నిస్తున్నారట వెలిచాల. మేడ్చల్ డీసీసీ పదవిలో మరోసారి తననే కొనసాగించాలని హరివర్ధన్‌రెడ్డి కోరారు. కానీ మేడ్చల్ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన వజ్రేష్ యాదవ్‌కే డీసీసీ పోస్ట్ ఇవ్వడంపై హరివర్ధన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేస్తున్నారట. ఇక నల్లగొండ డీసీసీ పదవిని గుమ్మల మోహన్ రెడ్డి ఆశించారు. మోహన్ రెడ్డి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి ప్రధాన అనుచరులలో ఒకరు. అయితే జిల్లాలో మంత్రి చెప్పిన వారికి కాకుండా..పున్నా కైలాష్ నేతకు ఎలా ఇస్తారని ప్రశ్నిస్తున్నారు. ఆదిలాబాద్ జిల్లా డీసీసీ ఆశించిన కంది శ్రీనివాస్ రెడ్డి కూడా తీవ్ర అసంతృప్తితో ఉన్నారట.ఇక డీసీసీ దక్కిన వారిలో కూడా కొందరు అసంతృప్తితో ఉన్నారు. యాదవ కురుమ కోటాలో మంత్రి పదవి ఆశించిన బీర్ల అయిలయ్యకు..భువనగిరి డీసీసీ అధ్యక్ష పీఠం కట్టబెట్టారు. దీంతో తనను జిల్లాకే పరిమితం చేస్తున్నారనే అసహనంతో ఉన్నారట అయిలయ్య. మరో ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్ కూడా అసంతృప్తితో ఉన్నారట. కాంగ్రెస్ తరఫున గెలిచిన ఎంబీసీ ఎమ్మెల్యేల్లో తాను ఒక్కడినే ఉన్నానని..మంత్రివర్గంలో చోటు కల్పించాలని కోరుతుంటే మరోసారి పెద్దపల్లి జిల్లాకే డీసీసీ అధ్యక్షుడిగా ఎంపిక చేశారని నిరాశలో ఉన్నారట.

**డీసీసీల ఎంపికలో రూల్స్ అన్నీ బ్రేక్..!**

అసంతృప్తులు, నిట్టూర్పులు ఇలా ఉంటే..ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ డీసీసీల ఎంపిక కోసం మొదట్లో పెట్టిన రూల్స్ అన్నీ బ్రేక్ అయ్యాయి. ఒక్క పోస్టుకు ఒక్కరే ఉండాలని చెబితే..5 మంది ఎమ్మెల్యేలు, ముగ్గురు కార్పొరేషన్ ఛైర్మన్లు, 12మంది పార్టీ వైస్ ప్రెసిడెంట్లకు డీసీసీలలో చోటు దక్కింది. గతంలో డీసీసీలుగా పని చేసిన వారు స్వచ్ఛందంగా తప్పుకోవాలనే నిబంధన పెట్టినా..నాగర్ కర్నూల్ డీసీసీగా కొనసాగుతున్న వంశీకృష్ణకే మరోసారి అవకాశం ఇచ్చారు. ప్రస్తుతం డీసీసీలుగా ఉన్న వారి కుటుంబ సభ్యులకు నో ఛాన్స్ అని చెప్పారు. కానీ సిద్దిపేట జిల్లా డీసీసీ పోస్ట్‌ను..ఇప్పటి వరకు డీసీసీగా ఉన్న నర్సారెడ్డి కూతురు అంక్షారెడ్డికి ఇచ్చారు.ఇంకా మిరాకిల్ ఏంటంటే..డీసీసీ పోస్టుకు దరఖాస్తు కూడా చేయని శివసేనారెడ్డికి వనపర్తి జిల్లా పగ్గాలు కట్టబెట్టడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఇలా ఎంపిక చేసేట్లు అయితే..ఏఐసీసీ పరిశీలకుల పర్యటనల పేరుతో హంగామా ఎందుకు చేశారంటూ ప్రశ్నిస్తున్నారు లీడర్లు. మొత్తం మీద డీసీసీల ఎంపిక కాంగ్రెస్ పెద్దలకు తలనొప్పిగా మారిందట. పంచాయితీ ఎన్నికల ముందు నేతల మధ్య విభేదాలు పార్టీకి నష్టం చేస్తాయని జిల్లా నేతలు ఆందోళన చెందుతున్నారు. ఈ ఇష్యూను హస్తం పార్టీ పెద్దలు ఎలా సాల్వ్ చేస్తారో చూడాలి.

## పాకిస్తాన్‌లో అల్లర్లు.. భారత్‌లో హై అలర్ట్.. ఏం జరగనుంది?

ఇస్లామాబాద్: పాకిస్తాన్‌లో మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ మరణించినట్లు వార్తలు రావడంతో ఆ దేశంలో అల్లర్లు, ఆందోళనలు పెరుగుతున్నాయి. ఇమ్రాన్ మద్దతుదారులు రోడ్లపైకి వస్తున్నారు. ప్రజలు కూడా ఉద్యమిస్తున్నారు. అద్యాల జైలు వద్దకి భారీగా ర్యాలీలు నిర్వహిస్తున్నారు. ఆయనకు ఏం జరిగిందో తెలియాలని డిమాండ్ చేస్తున్నారు.

**ఆరోగ్యంగా ఉన్నాడని చెప్పినా..**

పాకిస్తాన్ సైన్యం పాలనా ప్రమాణాలపై ప్రజల నమ్మకం తగ్గింది. ఇమ్రాన్‌ఖాన్ ఆరోగ్యంగా ఉన్నాడని సైనికాధికారి ఆసిమ్ మునీర్ తెలిపారు. అయినా ఆందోళనలు ఆగడం లేదు. తమకు ఒకసారి చూపించాలని డిమాండ్ చేస్తున్నారు. ఇమ్రాన్ సోదరీమణులు జైలు వద్దకు వెళిలితే ములాఖత్‌కు అవకాశం ఇవ్వడం లేదు. ఖైబర్‌ఫఖ్తూంగ్వా ముఖ్యమంత్రి కూడా ఇటీవల అద్యాల జైలు వద్దకు వెళ్లారు. అతనికి కూడా ఇమ్రాన్‌ను కలిసే అవకాశం ఇవ్వలేదు. దీంతో ఇమ్రాన్‌ఖాన్ పార్టీ నేతల్లో ప్రజల్లో ఆందోళనలు మరింత పెరుగుతున్నాయి. పాకిస్తాన్ నేషనల్ అసెంబ్లీలో కూడా పాకిస్తాన్ తెహ్రీక్ ఏ ఇన్‌సాన్ పార్టీ ప్రతినిధులు ఆందోళన చేస్తున్నారు. ఇమ్రాన్‌ఖాన్ గురించి సైన్యం గోప్యత పాటించడం, సైన్యం కారణంగానే ఇమ్రాన్ మరణించారని ఆరోపణలు వస్తుండడంతో ఆగ్రహాలు వ్యక్తమవుతున్నాయి. ఇక పాకిస్తాన్ ప్రధాని షహబాజ్ షరీఫ్ ప్రభుత్వాన్ని కూడా ప్రజలు చీదరించుకుంటున్నారు.

**భారత్‌లో అలర్ట్..**

పాకిస్తాన్ లోపల ఉన్న ఉద్రిక్తతల కారణంగా భారత్‌కు భారత్‌లో హై అలర్ట్ ప్రకటించారు. మన ఇంటలిజెన్స్ వర్గాలు భారత ప్రభుత్వానికి, సైన్యానికి కీలకసమాచారం అందించింది. పాకిస్తాన్‌లో ప్రజల దృష్టిమళ్లించేందుకు భారత్‌పై ఉగ్రదాడులు చేసే అవకాశం ఉందని తెలిపింది. సైనిక దాడులు చేసే ధైర్యం లేదు. ఇప్పటికే జైష్ ఏ మహ్మద్ కుట్రను భగ్నం చేయగలిగాం. ఢిల్లీ పేలుడు తర్వాత ఉగ్ర డాక్టర్లు పట్టుపడ్డారు. 2,900 కిలోల అమ్మోనియం నైట్రేట్ పట్టుకున్నారు. ఇప్పుడు పాక్ ప్రజల దృష్టిని మళ్లించేందుకు భారత్‌లో పాకిస్తాన్ ఉగ్రదాడులు చేయించే అవకాశం ఉంది. ఈమేరకు పాకిస్తానీల సంభాషణలు



గుర్తించారు. అయితే పాకిస్తాన్ ఏ దాడి చేసిన భారత్ ప్రతిదాడి చేస్తుంది. దీంతో ఈసారి బంగ్లాదేశ్ వైపు నుంచి దాడికి ప్లాన్ చేస్తోందని సమాచారం.

**సైన్యం అలర్ట్..**

మన భద్రతా బలగాలు కూడా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశాయి. లష్కర్ ఏ తోయిబాకు చెందిన చాలా మంది బంగ్లాదేశ్‌లో ఉన్నారు.అక్కడి హుజి సంస్థ ద్వారా బిహార్,యూపీ, అసోం, ఢిల్లీలో పేలుళ్లు నిర్వహించే ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తోంది.దీంతో పాకిస్తాన్ ప్రజల దష్టి మళ్లుతుందని పాకిస్తాన్ ప్రభుత్వం ఆలోచన చేస్తుందని సమాచారం.పాకిస్తాన్ కూడా పాక్‌కు చెందిన పలు ఉగ్ర సంస్థల కార్యకలాపాలపైనా నిఘా పెట్టింది.ఉగ్రవాదుల మాటలను ట్రేస్ చేస్తున్నారు.కోడ్ లాంగ్వేజ్‌ను డీ కోడ్ చేస్తున్నారు.మొత్తంగా భారత్ హై అలర్ట్‌లోఉంది.

### అయ్యప్ప భక్తులకు శుభవార్త

న్యూఢిల్లీ, అయ్యప్ప స్వామి భక్తులకు ఎయిర్ పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా శుభవార్త తెలిపింది. శబరిమలకు వెళ్లే మాలధారులు విమానాల్లో 'ఇరుముడి' తో ప్రయాణించొచ్చని తాజాగా వెల్లడించింది. విమానంలో కొబ్బరికాయలను స్వాములు తమ వెంట తీసుకెళ్లొచ్చని చెప్పింది.అయ్యప్ప స్వాముల నుంచి వచ్చిన వినతుల మేరకు, వారి సౌకర్యార్థం నిబంధనలను సడలించామని ఏఏఐ పేర్కొంది. ఈ నిబంధన అక్టోబర్ 28 శుక్రవారం నుంచి అమల్లోకి వస్తుందని

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com